# “తిరిగి వచ్చిన దేవుని గొప్ప మహిమ”

## యెహెజ్కేలు గ్రంథం - సంగ్రహ సమీక్ష

### A. ఉపోద్ఘాతం :

**I. గ్రంథకర్త :** యెహెజ్కేలు గ్రంథాన్ని ప్రవక్తయైన యెహెజ్కేలు వ్రాసాడని క్రీ.పూ. 2వ శతాబ్ద ప్రారంభములోనే అందరూ అంగీకరించారు. ఇతని తండ్రి బూజీ. వృత్తిరీత్యా ఇతడు యాజకుడు (యెహె 1:3). అయితే అతడు చెరలోనున్న ఇశ్రాయేలీయుల మధ్య ప్రవచించడానికి దేవునిచే ఏర్పరచబడ్డాడు. యెహెజ్కేలు అన్న మాటకు “దేవుడు బలపరచును” అని అర్థం.

1. **ప్రవక్త పిలుపు :** ఇతడు క్రీ.పూ. 597 సం. యెహోయాకీను రాజుతోపాటు బబులోను చెరలోకి వెళ్ళాడు (2 రాజు 24:14 నుండి) ఆ తరువాత 5 సం.లకు ప్రవక్తగా పేరొందాడు. బహుశ అప్పుడు అతని వయస్సు 30 ఏళ్ళు ఉండవచ్చును. యూఫ్రటీసు నది నుండి ప్రవహించే కెబారు నది వద్ద చెరలో నున్న ఇశ్రాయేలీయుల మధ్య ఇతని పరిచర్య కొనసాగింది. ఈ ప్రదేశం బబులోను పట్టణానికి చాలా మైళ్ళ దూరంలో ఉంది. హెబ్రీయుల చరిత్రలోకెల్లా అతిక్లిష్టమైన, గాఢాంధకారమయమైన పరిస్థితులలో అసాధారణమైన సందేశాన్ని అందించడానికి పిలువబడ్డాడు.

2. **ప్రవక్త ప్రత్యేకత :** యూదులు బబులోను చెరకు తీసుకొనివెళ్ళడం 3 దశలుగా జరిగింది.

❖ క్రీ.పూ. 605 సం॥ దానియేలు మరికొందరు తీసికొనిపోబడ్డారు.

❖ క్రీ.పూ. 597 సం॥ రాజైన యెహోయాకీను, యెహెజ్కేలు ఇంకా అనేకులు కొనిపోబడ్డారు.

❖ క్రీ.పూ. 586 సం॥ చివరిగా యూదా చివరి రాజైన సిద్కియా కొనిపోబడ్డాడు. అప్పుడు యెరూషలేము పట్టణం మరియు మందిరం సమూల నాశనం చేయబడింది (2రాజు 25:1-7). యిర్మీయా, యెహెజ్కేలు మరియు దానియేలు “సమకాలికులు”.

ప్రతి ఒక్కరు ప్రత్యేక గుంపు మధ్య పరిచర్య చేయడానికి పిలువబడ్డారు. యిర్మీయా యెరూషలేములో మిగిలిన శేషము మధ్య, దానియేలు బబులోను రాజమందిరంలో, యెహెజ్కేలు కెబారు నదీ తీరంలో చెరలోనున్న వారి మధ్య ప్రవచించారు. యెషయా, యిర్మీయా మరియు యెహెజ్కేలును “త్రిత్వపు ప్రవక్తలు” అని పిలుస్తారు. ఎందుచేతననగా యెషయా, దేవుని కుమారుడైన మెస్సీయాను గూర్చి, యిర్మీయా తండ్రియైన దేవుని గూర్చి ప్రాధాన్యతనిచ్చారు. యెహెజ్కేలు ఆత్మను గూర్చి ప్రాధాన్యతనిచ్చాడు. ఆత్మ అతని మీదికి, అతనిలోనికి వచ్చినట్లు, అతన్ని ఎత్తికొనిపోయినట్లు మరియు కష్టతరమైన అతని పరిచర్యలో అతనికి అనేక విధాల సహాయపడినట్లు పలుమార్లు యెహెజ్కేలు ప్రస్తావించాడు. గనుక ఇతన్ని ‘ఆత్మ ప్రవక్త’ అని కూడ పిలుస్తారు.

అంత మాత్రమే కాదు అతడు, దానియేలు మరియు యోహాను ప్రత్యక్షీకరణ ప్రవక్తలుగా ఎంచబడ్డారు. ఈ ముగ్గురు కూడ చెరలో దేవుని ప్రత్యక్షతలు పొంది, వాటిని గూర్చి వ్రాసారు. గనుక వీరు వ్రాసిన గ్రంథాలను "ప్రత్యక్షీకరణ గ్రంథాలు" అంటారు.

**3. ప్రవక్త సందేశం :** యెహెజ్కేలు రెండు విధాల పరిచర్యను చేసాడు.

ఎ. చెరలోని వారికి తమ పాపమును బట్టి కలిగే నాశనమును గూర్చి జ్ఞాపకం చేసాడు. (1-32 అధ్యా) యెరూషలేము నాశనమౌతుందని, శత్రు దేశాలకు తీర్పు తీర్చబడుతుందని చెప్పాడు.

బి. దేవుడు వారికి భవిష్యత్తులో ఇవ్వబోయే ఆశీర్వాదాలను గూర్చి మరియు మందిర పునరుద్ధరణను గూర్చి చెప్పాడు. (33-48 అధ్యా) యెషయా, **"దేవుని రక్షణను"** గూర్చి; యిర్మీయా **"దేవుని తీర్పును"** గూర్చి; దానియేలు **"దేవుని రాజ్యాన్ని"** గూర్చి ప్రవచించారు. యెహెజ్కేలు **"దేవుని మహిమను"** గూర్చి ప్రవచించాడు.

**4. ప్రవక్త బోధనా పద్ధతి :** యెహెజ్కేలు అబద్ధ ప్రవక్తలను మరియు వారు ప్రజలలో కలిగించిన బూటకపు నిరీక్షణను ఎదుర్కోవలసి వచ్చింది. పాపము మరియు వినాశనంతో కూడిన దినాలలో ప్రజలలో ఉత్పన్నమైన విభేదాలు, నిరాశ నిస్పృహలను బట్టి వారు అతని సందేశాన్ని పెడచెవినిబెట్టారు. కనుక యెహెజ్కేలు తానే ఉపమానార్థంతో అభినయం చేయడం ప్రారంభించాడు. దేవుని చేతిలో పాత్రధారి అయ్యాడు. ప్రజలు అతని మాటలను వినలేదు గనుక తన చేష్టల ద్వారా వారిని ఆకర్షించాడు. దేవుడు ఇశ్రాయేలును గూర్చి చెప్పిన వాటన్నిటికి ఇతడు సూచనగా ఉన్నాడు. "యెహెజ్కేలు మీకు సూచనగా ఉండును, అతడు చేసినదంతటి ప్రకారము మీరును చేయుదురు, ఇది సంభవించినప్పుడు నేను ప్రభువైన యెహోవానైయున్నానని మీరు తెలిసికొందురు" (యెహె 24:24). ఈ బోధనా విధానాన్ని బట్టి అతడు "అభినయ ప్రవక్తగా" లేక "సంజ్ఞల ప్రవక్త"గా పిలువబడ్డాడు.

## II. వ్రాయబడిన కాలం :

యెహెజ్కేలు గ్రంథం క్రీ.పూ. 200 సం॥లో వ్రాయబడిందని కొందరు పండితులు అభిప్రాయపడినా, ఎక్కువ మంది ఇది పాలస్తీనా దేశంలోనే వ్రాయబడి ఉండవచ్చునని భావిస్తున్నారు. క్రీ.పూ. 6వ శతాబ్దంలో యెహెజ్కేలు స్వయంగా వ్రాసాడన్నమరో అభిప్రాయాన్ని ప్రస్తుత కాలంనాటి పండితులు నిరాకరిస్తున్నారు. క్రీ.శ. 1వ శతాబ్దంలో కొందరు ఈ గ్రంథము యొక్క ప్రామాణికత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నం చేసారు. ఎందుకంటే 16వ అధ్యాయం తీవ్రవాదపూరితమని, మొదటి అధ్యాయంలో మార్మిక ఊహలు మరియు 40-48 అధ్యాయాలలో మోషే ధర్మశాస్త్రానికి విరుద్ధమైన విషయాలున్నాయని వారి అభిప్రాయం. 40-48 అధ్యాయాలలో యెహెజ్కేలు, మరికొందరి ప్రవచనాలున్నాయి. బహుశా ఇవి తరువాత చేర్చబడి ఉంటాయి. 33:21కి, 40:1కి, మధ్య 13 సం॥ల కాలవ్యవధి ఉంది. శైలిలో కూడ మార్పు ఉంది. దీన్ని బట్టి జోసీఫస్ అనే యూదుల చరిత్రకారుడు యెహెజ్కేలు ప్రవక్త రెండు గ్రంథాలు వ్రాసి ఉండవచ్చునని భావించాడు.

**III. గ్రంథ విశిష్టత :** యెహెజ్కేలు ఈ గ్రంథంలో నరపుత్రుడని సంబోధించబడడం గమనార్హం. ఈ మాట సుమారు 100 సార్లు వ్రాయబడింది. 48 అధ్యాయాలున్న ఈ గ్రంథంలో, 27 అధ్యాయాలలో 62 పర్యాయాలు **"నేను యెహోవానైయున్నానని వారు తెలిసికొంటారు"** అని చెప్పబడింది.

తన ప్రజల వైఫల్యాన్ని బట్టి దేవుని సార్వభౌమత్వం మరియు ఆయన శక్తి మార్పు చెందదని ఆయన వాటికి అతీతుడని స్పష్టం చేయబడింది. దేవుని కృపాకార్యాన్ని బట్టి వారిలో పశ్చాత్తాపం కలుగుతుంది (36:16 నుండి) గనుక ప్రజలు దేవుని ఉద్దేశాలకు పూర్తిగా కట్టుబడి ఉండాలని బోధించాడు. అలాంటి కాలం కోసం ఎదురుచూసాడు.

**IV. మూల వచనం : "నేను దేశమును పాడు చేయకుండునట్లు ప్రాకారమును దిట్టపరచుటకు, బద్దలైన సందులలో నిలుచుటకును తగిన వాడెవడని నేను ఎంత విచారించినను ఒకడైనను కనబడలేదు"** (యెహెజ్కేలు 22:30).

## బి. యెహెజ్కేలు గ్రంథ విభజన :

### I. దేవుని మహిమ - ప్రవక్తపని (1-7 అధ్యా)

1. మహిమ ప్రదర్శించబడుట - 1 అధ్యా
2. ప్రవక్త పిలుపు మరియు పని కొరకు శక్తితో నింపబడుట - 2 అధ్యా
3. ప్రవక్త సిద్ధపాటు - కావలి వానిగా అతని విధులు - 3 అధ్యా
4. యెరూషలేమును గూర్చిన తీర్పు - 4 అధ్యా
5. ప్రవక్త క్షౌరము చేయించుకొనుట - దాని సూచన - 5 అధ్యా
6. యెరూషలేముపై పడనున్న ఖడ్గం, శేషం రక్షించబడుట - 6 అధ్యా
7. యెరూషలేము అంత్య నాశనాన్ని గూర్చిన ప్రవచనం - 7 అధ్యా

### II. దేవుని మహిమ వెళ్ళిపోవుట (యెరూషలేము మరియు ఇశ్రాయేలు పూర్తిగా చెరగొనిపోబడుట) (8-24 అధ్యా)

1. మహిమను గూర్చిన దర్శనం, మందిరం విగ్రహారాధనతో అపవిత్రం చేయబడుట, దాని నాశన వివరాలు - 8 అధ్యా
2. షెకీనా మహిమ మందిరాన్ని విడచి వెళ్ళుటకు సన్నద్ధమగుట - 9 అధ్యా
3. షెకీనా మహిమ పరిశుద్ధ స్థలాన్ని నింపుట, మందిరాన్ని విడుచుట - 10 అధ్యా
4. యెరూషలేము ప్రధానులను గూర్చిన ప్రవచనాలు - 11 అధ్యా
5. యెరూషలేమును గూర్చి యెహెజ్కేలు నాటకీయ వివరణ - 12 అధ్యా
6. అబద్ధ ప్రవక్తలు మరియు ప్రవక్త్రిలను గూర్చిన ప్రవచనాలు - 13 అధ్యా
7. పెద్దల విగ్రహారాధనను గూర్చిన ప్రవచనాలు, యెరూషలేముకు తప్పనిసరిగా సంభవించనున్న నాశనం - 14 అధ్యా
8. ద్రాక్షావల్లిని గూర్చిన దర్శనం - 15 అధ్యా
9. దేవునిచే దత్తత తీసుకోబడిన బిడ్డగానున్న యెరూషలేము విడచిపెట్టబడుట-16 అధ్యా
10. రెండు పక్షిరాజుల ఉపమానం - 17 అధ్యా

11. పాపం వలన వచ్చే జీతం మరణం – 18 అధ్యా
12. రాజకుమార్తెయైన ఇశ్రాయేలు పట్ల యెహోవా విముఖత – 19 అధ్యా
13. ఇశ్రాయేలు జాతి పాపాల పునర్విమర్శ, భవిష్యత్ తీర్పు మరియు సమకూర్పు–20 అధ్యా
14. దావీదు వంశపు చివరి రాజును, బబులోను రాజు తొలగించుట – 21 అధ్యా
15. యెరూషలేము హేయక్రియల సమీక్ష – 22 అధ్యా
16. ఇద్దరు సహోదరీలను (సమరయ మరియు యెరూషలేము) గూర్చిన ఉపమానం – 24 అధ్యా
17. మసలుచున్న కుండను గూర్చిన ఉపమానం – 24 అధ్యా

## III. దేవుని మహిమ – దేశములపై తీర్పు (25–32 అధ్యా)

1. అమ్మోను, మోయాబు, ఏదోము మరియు ఫిలిష్తీయ గూర్చి – 25 అధ్యా
2. తూరు గూర్చి – 26–28 అధ్యా
3. ఐగుప్తును గూర్చి – 29–32 అధ్యా

## IV. దేవుని మహిమ – రానున్న రాజ్యం (33–48 అధ్యా)

1. ప్రవక్త పనిని గూర్చిన పునరాదేశం – (33, 34 అధ్యా)
2. ఇశ్రాయేలు సమకూర్పు – (35, 36 అధ్యా)
3. ఇశ్రాయేలు పునరుద్ధరణ (పునరుజ్జీవం) – (37 అధ్యా)
4. గోగు, మాగోగు త్రోసివేయబడుట – (38, 39 అధ్యా)
5. మందిర పునఃనిర్మాణం – (40–42 అధ్యా)
6. దేవుని మహిమ తిరిగివచ్చుట – (43–44 అధ్యా)

## సి. యెహెజ్కేలు గ్రంథం సంగ్రహ సమీక్ష - అంశాల వారిగా సంక్షిప్త వివరణ

**I. దేవుని మహిమను గూర్చిన దర్శనాలు :** యెహెజ్కేలు గ్రంథ ప్రారంభంలోనే దర్శనాలను గూర్చి ప్రస్తావించాడు (1:1). హెబ్రీ భాషలో దర్శనానికి ఉపయోగించబడిన మాటకు చూచుట లేక తేరిచూచుట అని అర్థం. ప్రవక్తలు, కలల ద్వారా, కొన్ని పర్యాయాలు మెలకువగా ఉండగానే పరవశ స్థితిలో దర్శనాలు చూసేవారు. యెహోవా నుండి పొందే వాక్కును గూర్చి కూడ ప్రత్యక్షతగా భావించారు (1:3). యెహెజ్కేలు ప్రత్యేకించి దేవుని మహిమను గూర్చి 3 దర్శనాలను చూసాడు. యెహోవా హస్తము యొక్క ప్రమేయం కూడ కనిపిస్తున్నది (3:14,22; 8:1; 33:22; 37:1; 40:1).

**1. దేవుని మహిమను గూర్చిన మొదటి దర్శనం (1:4–28) :** మొదటి అధ్యాయంలో యెహెజ్కేలు చూచిన దర్శనానికి ప్రకటన గ్రంథం 4,5 అధ్యాయాలలోని దర్శనానికి పోలికలున్నాయి. ఈ దర్శనంలో సింహాసనాసీనుడైన దేవుడే ప్రధానాంశం. యెషయా గ్రంథంలో దేవుని సింహాసనానికి సంబంధించిన సూత్రాలను గూర్చి, యిర్మీయా గ్రంథంలో ఆ సింహాసనానికి సంబంధించిన పనిని గూర్చి, యెహెజ్కేలు గ్రంథంలో ఆ సింహాసనం పైనున్న వ్యక్తిని గూర్చి చెప్పబడింది. ఈ దర్శనంలో దేవుని వ్యక్తిత్వం చూపించబడలేదు. ఎవరూ ఎప్పుడూ దేవున్ని చూడలేదు (నిర్గ 33:18–23; యోహా

1:18), చూడలేరు కూడ (1తిమో 6:16), కనుక ఆయన మహిమను మాత్రం కనుపర్చాడు.

ఇశ్రాయేలీయులంతా బబులోను చెరలో దుఃఖితులైయుండగా, (కీర్త 137:1) యెహెజ్కేలు మహిమాన్వితమైన ఈ దర్శనాన్ని చూసాడు. ప్రతి ఒక్కరి జీవితంలో క్లిష్టపరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ పరిస్థితులనే చూస్తూ, చింతిస్తు ఉంటే కృంగిపోతాము. వాటి నుండి బయటకి వచ్చే మార్గాన్ని కనుగొనలేము. కాని ఆ పరిస్థితులను అనుమతించిన సార్వభౌముడైన దేవుని వైపు చూడగలిగితే మన భవిష్యత్తును గూర్చిన అనేక విషయాలను తెలిసికోగలుగుతాము. ఈ దర్శనంలో ఉత్తర దిక్కు దేవుని సింహాసనాన్ని సూచిస్తుంది (యెష 14:13). అయితే ఉత్తర దిక్కు దేవుని స్థానం అని ఖచ్చితంగా చెప్పలేము. తుఫాను దేవుని సింహాసనపు తీవ్ర కదలికలను సూచిస్తుంది.

ఈ దర్శనంలోని 4 జీవులు కెరూబులను పోలినవని వ్రాయబడింది. కెరూబులు దేవదూతలలో ఒక వర్గం. వీరిని గూర్చి బైబిలులో 3 సార్లు ప్రస్తావించబడింది.

1. ఏదేను తోటలో (ఆది.కా. 3:24)
2. యెహెజ్కేలు దర్శనాలలో (యెహెజ్కేలు 1:4-28; 10:1-22)
3. యోహాను దర్శనంలో (ప్రకటన 4:6-8)

**ఈ కెరూబుల పని నాలుగు విధాలుగా ఉన్నది.**

1. దేవుని సింహాసనాన్ని, ఆయన నీతిని, మహిమను కాయుట. అనగా పాపంలోనున్న మానవుడు దేవున్ని సమీపించకుండ చూచుట. (ఉదా : ఆది 3:24).
2. మానవుడు దేవుని యొద్దకు రాగల మార్గాన్ని చూపించుట. దేవుని కృపకు సాదృశ్యంగా ఉన్న కెరూబులు (నిర్గ.కా. 25:22) (కరుణా పీఠము మీద) మానవులు దేవుని కృపను ఆయన సన్నిధిని పొందగల స్థానంగా ఉన్నాయి.
3. దేవుని పరిపాలన నిర్వహణలో సహాయం చేయుట. (1 సమూయేలు 4:3-7; కీర్తన 80:1; 99:1; యెహెజ్కేలు 1:26)
4. ఈ భూమి మీద క్రీస్తు యొక్క పరిచర్యను గూర్చి నిత్యం జ్ఞాపకం చేసే సూచనలుగా ఉండుట.

మత్తయి తన సువార్తలో యేసుక్రీస్తును రాజుగా పరిచయం చేసాడు. ఆ జీవుల ముఖ రూపాలలో సింహము యేసు రాజరికాన్ని సూచిస్తున్నది. మార్కు యేసుక్రీస్తును పరిచారకునిగా పేర్కొన్నాడు. ఎద్దు, క్రీస్తు పరిచారకుడని సూచిస్తున్నది. లూకా ఆయనను మనుష్య కుమారునిగా, యోహాను దేవుని కుమారునిగా పరిచయం చేసారు. మనుష్య ముఖం యేసు మానవత్వాన్ని, పక్షిరాజు ముఖం ఆయన దైవత్వాన్ని సూచిస్తున్నాయి.

చక్రాలు కొనసాగించబడుతున్న దేవుని ప్రత్యక్షతను ఆయన శక్తిని జ్ఞాపకం చేస్తున్నాయి. ఎందుచేతననగా జీవులకున్న ఆత్మనే చక్రాలకు ఉందని వ్రాయబడింది (యెహె 1:21). దేవుడు సర్వశక్తుడు. తన ఉద్దేశాలను నెరవేర్చడానికి ఆయన ముందుకే సాగుతాడు.

వాటి చుట్టు ఉన్న కళ్ళు దేవుని భవిష్యత్ జ్ఞానాన్ని తెలియజేస్తున్నాయి. దేవుడు ఈ లోకాన్ని ఒక లక్ష్యము లేకుండ, భవిష్యత్తులోనికి నడిపించడం లేదు. ఆయన చేసిన ప్రతి అణువును గూర్చి ప్రత్యేక ఉద్దేశం ఉంది. నీ జీవితం కొరకు ఆయన ప్రణాళికలో ప్రత్యేక ఉద్దేశం ఉంది. నీ భవిష్యత్తును ఆయనే తన చిత్తానుసారంగా నిర్ణయించాడు (కీర్త 139:16). ఆయన ఉద్దేశాన్ని జ్ఞానయుక్తంగా కొనసాగిస్తున్నాడు. అయితే ఆయన ఉద్దేశాన్ని తెలిసికొని, ఆయన చిత్తానుసారంగా మన భవిష్యత్తును మలచుకోవడం మనపైననే ఆధారపడి ఉంది. మనం ఈనాడు సజీవులుగా ఉన్నామంటే ఆయన చిత్తాన్ని నెరవేర్చడానికే. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ కెరూబులు దేవుని మహిమను మోసుకొని వెళ్ళే వాహకాలుగా ఉన్నాయి.

దేవుని మహిమ కోసమే చేయబడిన మానవుడు కూడ, దేవుని మహిమ వాహకంగా ఉండాలని దేవుని ఉద్దేశం (యెషయా 43:7,21). పాపంవలన మనిషి ఆయనను మహిమపరచ లేకపోగా దేవుని మహిమను కూడ పొందలేకపోయాడు (రోమా 3:23). యేసుక్రీస్తు మనందరి పాపాల కోసం తన ప్రాణాన్ని అర్పించి తిరిగి లేచుట ద్వారా మనం ఆయన మహిమను తిరిగిపొందడానికి (యోహాను 17:23) ఆయన మహిమను చూడడానికి అవకాశం కల్పించాడు (యోహాను 17:24). యేసు క్రీస్తును రక్షకునిగా అంగీకరించిన వారందరు ఈ లోకంలో వారి జీవితం ద్వారా దేవున్ని మహిమపర్చాలి (మత్తయి 5:16).

యెహెజ్కేలు చూచిన దర్శనం మరో సత్యాన్ని కూడ జ్ఞాపకం చేస్తున్నది. ఈ నాలుగు జీవులు కలిసి పరిపూర్ణమైన పొందికతో దేవుని మహిమకోసం పనిచేస్తాయి. చక్రాలు, కెరూబులతో మరియు ఆత్మతో నిమిత్తం లేకుండ పని చెయ్యలేదు (1:17,19,20,21). క్రీస్తును విశ్వసించిన వారందరూ ఆయన శరీరంలో అవయవాలుగా ఉన్నారు. ఒక్క శరీరముగానున్న మనందరం ఆత్మ నడిపింపుతో ఐక్యతకలిగి, దేవుని మహిమ కోసమే పని చెయ్యాలి.

ఈ దర్శనంలో దేవుని లక్షణాలు స్పష్టంగా గోచరమౌతున్నాయి. ఆయన సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి, సార్వభౌముడు. ఈలాంటి దేవుని మహిమ ఇంకా చెరలోనున్న ఇశ్రాయేలీయులతోనే ముడిపడి ఉన్నది. దేవుని ప్రజలమైన మనం ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితిలో ఉన్నా అక్కడ ఆయన సన్నిధి ఉంటుంది (హెబ్రీ 13:5). కనుక ఎక్కడ ఉన్నా ఏమి చేసినా ఆయననే మహిమపర్చాలి (1 కొరింథి 10:31).

యెహెజ్కేలు చూచిన ఈ మొదటి దర్శనం పూర్తిగా అర్థంకాకున్న దేవుని మహిమా ప్రకాశానికి సంబంధించి, వర్ణనాతీతమైన మర్మమేదో ఉంది. ఈ దర్శనం ద్వారా యెహెజ్కేలును కలవరపర్చాలని కాదుగాని, దేవుని పరిచర్యను ప్రారంభించక ముందు, దేవుని మహాత్యాన్ని, మహిమను తెలిసికొని భయభక్తులతో ఆయనను సేవించాలని దేవుని ఉద్దేశం.

## 2. దేవుని మహిమను గూర్చిన రెండవ దర్శనం (8-11 అధ్యా)

మొదటి దర్శనం తరువాత 14 నెలలకు ఈ దర్శనాన్ని చూసాడు. దేవుడు యెహెజ్కేలును అసాధారణమైన రీతిలో యెరూషలేముకు తీసికొని వెళ్ళాడు. అతడు శరీరంతో వెళ్ళాడో

లేదో తెలియదు. ఈ దర్శనాన్ని గూర్చి పలు అభిప్రాయాలున్నాయి.

1. యెహెజ్కేలు బబులోను దేశంలో కెబారు నది ఒడ్డున ఉండే ఈ దర్శనాన్ని చూసాడని కొందరి అభిప్రాయం.

2. నిజంగా యెరూషలేముకు వెళ్ళాడని, ఆ పట్టణంలో నడిచాడని ఇక్కడ వ్రాయబడిన వాటన్నిటిని చూసాడని మరికొందరి అభిప్రాయం.

ఆత్మద్వారా శరీరంతో కొనిపోబడడం ఏలియా (2 రాజు 2:11) మరియు ఫిలిప్పు (అపొ.కా. 8:39) జీవితాల్లో చూడగలము. యెహెజ్కేలు అనుభవం అలాంటిదైనా కావచ్చును లేక పౌలుకు (2 కొరింథీ 12:2) మరియు యోహానుకు కలిగిన అనుభవం లాంటిది (ప్రక 4:1,2) కావచ్చును. దేవుడు అతన్ని అదృశ్యునిగా తీసుకొని వెళ్ళాడు గనుక ప్రజలు అతన్ని గుర్తించి ఉండకపోవచ్చును. 8వ అధ్యాయం మొదటి వచనం నుండి ప్రారంభమైన ఈ దర్శనాల పరంపర 11వ అధ్యాయం 25వ వచనం వరకు కొనసాగింది.

ఈ దర్శనంలో యెహెజ్కేలు మొదట ఉత్తరము వైపున ఉన్న ఆవరణం ద్వారమును చూసాడు (8:1-3). తరువాత మందిరావరణంలో రహస్యంగా ఉన్న ఒక గదిలోనికి వెళ్ళాడు. ఆ గది గోడలపైన ప్రాకెడి సకల జంతువుల ఆకారాలు, హేయమైన మృగాల ఆకారాలు, అనగా ఇశ్రాయేలీయులు ఆరాధిస్తున్న దేవతల విగ్రహాలన్ని చిత్రీకరించబడి ఉండడం (8:7-10), వాటి ముందు ధూపార్తులు చేతపట్టుకొని ఉన్న 70 మంది ఇశ్రాయేలీయుల పెద్దలను, షాఫాను కుమారుడైన యజన్యాను చూసాడు. బహుశ యెహెజ్కేలు వీరిని చూచి ఆశ్చర్యపడి ఉండవచ్చును. ఎందుకంటె 30 సం॥ల క్రితం యెరూషలేములో యోషీయా కాలంలో జరిగిన మతసంస్కరణలో షాఫాను ప్రధాన పాత్రధారి. రాజు ఎదుట ధర్మశాస్త్రాన్ని చదివింది ఇతడే (2 రాజు 22:8-11).

ఈ 70 మంది పెద్దలు, అర్చకేతరులని (Laity) చెప్పవచ్చును (నిర్గ 24:9,10; సంఖ్యా 11:16) చూడండి. విగ్రహారాధనను అరికట్టడమే వారి ప్రధాన బాధ్యత. కాని వారే విగ్రహారాధన చేస్తున్నారు. తరువాత దేవుడు యెహెజ్కేలును మందిరపు ఉత్తర ద్వారము దగ్గర దింపాడు. అక్కడ స్త్రీలు కూర్చుండి, తమ్మూజు దేవతను గూర్చి ఏడ్వడం గమనించాడు. తమ్మూజును బబులోనీయులు సాఫల్యత, ప్రత్యుత్పత్తికి సంబంధించిన దేవుడుగా, ప్రకృతిని, ఋతు చక్రాలను శాసించేవాడుగా ఎంచారు, నమ్మారు. ప్రతి సంవత్సరం ఆకులు రాలేకాలంలో తమ్మూజు మరణించాడని, వసంతకాలంలో ప్రకృతి చిగిర్చినపుడు తిరిగి బ్రతికాడని నమ్మేవారు. ప్రతి సంవత్సరం తమ్మూజు మరణం గూర్చి స్త్రీలు విలపించేవారు. ఈ దృశ్యాన్ని చూసాక యెహోవా ఆత్మ యెహెజ్కేలును మందిరపు లోపలి ఆవరణములో దింపాడు.

అక్కడ, ఆలయ ద్వారము దగ్గరనున్న, ముఖమంటపమునకు బలిపీఠముకును మధ్య ఇంచుమించు 25గురు తూర్పువైపు ముఖాలు త్రిప్పి సూర్యునికి నమస్కారం చేయడం చూసాడు. వీరు, మందిరంలో సేవచేస్తున్న 24గురు యాజకులు మరియు ప్రధాన

యాజకున్ని సూచిస్తున్నారు. ఎప్పుడో ఒకప్పుడు ఈలాంటి ప్రమాద స్థితి వస్తుందనే, మోషే సూర్యున్ని పూజించవద్దని హెచ్చరించాడు (ద్వితీ 4:19). దేవుని ఆలయంలో, ఇశ్రాయేలు పెద్దలు (అర్చకేతరులు) స్త్రీలు, యాజకులు (అర్చకులు) చేస్తున్న విగ్రహారాధనను బట్టి కఠిన శిక్ష విధించబడుతుంది (యెహె 9:4-10). దేవుని మార్గంలో ప్రజలను నడిపించాల్సిన బాధ్యత గలవారే దేవునికి వ్యతిరేకంగా ప్రవర్తించడం వలన దేవుని తీర్పు దేవుని పరిశుద్ధ స్థలం నుండే అనగా బాధ్యతగల వారితోనే ప్రారంభమైంది. దేవుని సంఘంలో సేవలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరూ ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అందుకే అపొస్తలుడైన పేతురు తన పత్రికలో **"తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది. అది మన యొద్దనే ఆరంభమైతే భక్తిహీనుడును పాపియు ఎక్కడ నిలుతురు?"** అని ప్రశ్నించాడు (1 పేతురు 4:17).

యూదా పాపమును గూర్చి ప్రలాపిస్తున్నవారి నొసట గుర్తు వేయమని దేవుడు తన దూతలకు ఆజ్ఞాపించాడు. ఈ ముద్ర వారిని మరణం నుండి తప్పించడానికే, (ప్రకటన 7:1-3తో పోల్చి చూడండి).

యూదాపై రానున్న తీర్పును గూర్చిన ఈ దర్శనాన్ని చూచిన యెహెజ్కేలు దేవుని సన్నిధిలో గోజాడుతున్నాడు (యెహె. 9:8). వారిపట్ల యెహెజ్కేలుకున్న ప్రేమ ఇక్కడ వ్యక్తమౌతుంది. దేవునికి కూడ వారిపట్లగల ప్రేమ తరిగిపోలేదని, ఆయన జాగు చేసిన విధానాన్ని బట్టి తెలుస్తుంది. 8వ అధ్యాయం నుండి 10వ అధ్యాయం వరకు క్రమేణ దేవుని మహిమ తీసివేయబడింది. కొంతమంది రాజైన మనష్షే కాలంలో జరిగిన ఈ విషయం యెహెజ్కేలుకు దర్శన రూపంలో చూపించబడిందని చెప్తారు. బహుశ మనష్షే కాలంనుండి కూడ దేవుని మహిమ వస్తూపోతూ ఉండవచ్చును. గాని దేవుడు వెంటనే వారిని విడచి పెట్టలేదు. ఆయన కృపగలవాడు, దీర్ఘశాంతుడు.

అయితే ప్రజలు ఆయన వైపు తిరుగనందువల్ల వారికి పరాన్ముఖుడయ్యాడు. దేవుని మహిమ మందిరంలో నుండి వెళ్ళి, పట్టణం వెలుపల తూర్పు భాగాన నిలిచింది. ఆయన తన ఆలయాన్ని అనగా తన నివాసస్థలాన్ని, తన ప్రజల్ని విడచిపెట్టడానికి అయిష్టత చూపడం గమనించవచ్చును.

**3. దేవుని మహిమను గూర్చిన మూడవ దర్శనం (యెహె 40 - 48 అధ్యా) :**

ఈ దర్శనంలో దేవుని మహిమ తిరిగి దేవుని ఆలయంలోకి రావడం యెహెజ్కేలు చూసాడు (43:1-9). ఇది భూమ్మీద జరిగించబడే క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనలో సంభవిస్తుంది. ఈ దర్శనమంతా దేవుని మందిర వర్ణనను గూర్చినదే. దేవుని మందిర నిర్మాణం గూర్చి 7 విషయాలు బైబిలులో వ్రాయబడ్డాయి.

1. మోషే ప్రత్యక్ష గూడారం. (నిర్గ.కా. 40 అధ్యా) (క్రీ.పూ. 1500-1000)
2. సొలొమోను కట్టిన ఆలయం (1రాజు 5-8) (క్రీ.పూ. 100-586)
3. జెరుబ్బాబెలు కట్టిన ఆలయం (ఎజ్రా 6 అధ్యా) తరువాతి కాలంలో హేరోదు దీన్ని పునర్నిర్మించాడు. (యోహాను 2:20) (క్రీ.పూ. 516 - క్రీ.శ.70)

4. క్రీస్తు శరీరమనే ఆలయం (యోహాను 2:21) (క్రీ.పూ. 4 - క్రీ.శ. 30)

5. సంఘమనే ఆత్మీయ ఆలయం (పెంతెకోస్తు దినం నుండి క్రీస్తు రాకడ వరకు)

6. మహా శ్రమల కాలంలోని ఆలయం (ప్రక. 11 అధ్యా) (సంఘం ఎత్తబడినప్పటి నుండి హర్‌మెగిద్దోను యుద్ధం వరకు)

7. వెయ్యేండ్ల పాలన కాలంలో ఆలయం (యెహె. 40-48 అధ్యా; యావేలు 2:18; యెషయా 2:3; 60:3; దాని 9:24; హగ్గయి 2:7,9)

**వెయ్యేండ్ల పాలనలో ఉండబోయే మందిరమును గూర్చిన వివరణ.**

**1. పరిశుద్ధ స్థలం :** వెయ్యేండ్ల పాలనలో పాలస్తీనా దేశం తిరిగి 12 గోత్రాలకు పంచిపెట్టబడుతుంది. ఈ దేశం 3 భాగాలుగా విభాగించబడుతుంది. ఉత్తర భాగంలో 7 గోత్రాలు, దక్షిణ భాగంలో 5 గోత్రాలు ఈ రెండు స్థలాల మధ్య ప్రతిష్ఠితమైన స్థలం ఉంటుంది. ఈ ప్రతిష్ఠిత స్థలం 1160 మైళ్ళ వైశాల్యముగల చతురస్రాకారము. ఈ స్థలం ప్రపంచంలో దైవిక పరిపాలనకు, ఆరాధనకు కేంద్రస్థానంగా ఉంటుంది. ఈ పరిశుద్ధ స్థలం మధ్యలో దేవుని ఆలయం ఉంటుంది. ఇది యెరూషలేము పట్టణంలో కాక, ఎత్తైన ఒక కొండపై ఉంటుంది (యెషయా 2:3; మీకా 4:1-4; యెహెజ్కేలు 37:26)

**2. దాని కొలతలు (40:1; 42:20; 46:21-24).**

**3. ఈ ఆలయ నిర్మాణం యొక్క ఉద్దేశం.**

అ. దేవుని మహిమ మేఘం నిలవడానికి స్థలాన్ని కేటాయించుటకు (యెహె 43:1-17)

ఆ. మహిమరాజు కొరకు ఒక కేంద్ర స్థానాన్ని నియమించుటకు (యెహె 43:7; యెష 2:2,3)

**4. దాని యాజకత్వం (44:5-31) :** యాజకుడైన సాదోకు కుమారులే యాజకత్వం జరిగిస్తారు (యెహె 40:46; 43:19; 44:15; 48:11). సాదోకు అహరోను వంశంలో 11వ వారసుడు, ఇతడు దావీదు కాలంలో యాజకునిగా ఉన్నాడు (1 సమూ 2:35; 1 రాజు 2:27, 35).

**5. ఆలయ అధిపతి (రాజు) :** (45:7,8,17; 46:1-20) : మర్మముగా ఉంచబడిన ఈ అధిపతిని గూర్చి సుమారు 17 సార్లు వ్రాయబడింది. ఆయన ఎవరైనప్పటికినీ, ప్రజలకు మరియు యాజకులకు మధ్య ప్రధాన పాత్రను ఈ దేవాలయంలో నిర్వహిస్తాడు. అతడు క్రీస్తు అని కొందరి అభిప్రాయం. అయితే అతడు ప్రాయశ్చిత్తార్థబలి అర్పించడానికి సిద్ధపడుతున్నాడు (యెహె. 45:22). అతడు వివాహితుడు మరియు అతనికి కుమారులున్నారు గనుక (46:16), అతడు క్రీస్తు కాదని చెప్పవచ్చును. అతడు బహుశా దావీదు వంశం నుండి వచ్చినవాడై, క్రీస్తు విరోధికి అబద్ధ ప్రవక్త జతగా ఉన్నట్లు దావీదుకు జతగా ఉంటాడని భావిస్తున్నారు.

**6. ఈ ఆలయ విశిష్టత :**

అ. ఒక్క బలిపీఠము తప్ప, మోషే నిర్మించిన ప్రత్యక్ష గుడారం, సొలొమోను మరియు

హేరోదు కట్టించిన మందిరాలలోని ఉపకరణాలేవీ ఈ మందిరంలో ఉండవు. కారణం అవన్నీ క్రీస్తులో నెరవేర్చబడ్డాయి.

1. తెర – క్రీస్తు మరణ సమయంలో చినిగింది (మత్త 27:51).

2. సన్నిధి రొట్టెల బల్ల – క్రీస్తే జీవాహారంగా ప్రత్యక్షపర్చబడ్డాడు.

3. దీపస్తంభం – లోకానికి వెలుగైన క్రీస్తే ప్రకాశిస్తున్నాడు.

ఆ. ఈ మందిరంలోని మరో విశిష్ఠత ఏమంటే తూర్పు ద్వారం మూసివేయబడి ఉంటుంది (44:2). యేసుక్రీస్తు ఈ ద్వారం గుండా ప్రవేశించబోతున్నాడు గనుక దానిగుండా ఇతరులెవ్వరు ప్రవేశించకూడదన్న ఉద్దేశంతో, లేక గతంలో దేవుని మహిమ మందిరాన్ని విడచి తూర్పు ద్వారం గుండా వెళ్ళిపోయింది (10:18,19), గనుక తిరిగి వచ్చిన ఆయన మహిమ మరెన్నడూ వెళ్ళిపోదని జ్ఞాపకం చెయ్యడానికి ఆ ద్వారాన్ని మూయాలని చెప్పబడి ఉండవచ్చును.

7. **ఆలయంలోని బలులు :** మందిరంలో ఇతర పరికరాలేవీ లేకుండ బలిపీఠం మాత్రం ఎందుకు ఉన్నది అనే ప్రశ్న మీకు కలుగవచ్చును. వెయ్యేండ్ల పాలనలో కూడ బలులు అర్పించబడతాయని వాక్యం చెప్తుంది (యెషయా 56:6,7; 60:7; జెకర్యా 14:16–21; యిర్మీయా 33:18). యేసుక్రీస్తు బల్యర్పణ సృష్ఠి ప్రారంభం నుండి వెయ్యేండ్ల పాలన వరకు కూడ ప్రతి మానవుని పాప పరిహారానికి చాలినది. అయితే వెయ్యేండ్ల పాలనలో జన్మించినవారికి, తిరిగి జన్మించుట యొక్క అవశ్యకతను, విలువైన రక్షణను ఉదహరించడానికి సాదృశ్యంగాను, పాపం యొక్క భయంకరత్వాన్ని, దేవుని పరిశుద్ధతను వివరించడానికి మాత్రమే ఈ బలులు అర్పించబడతాయిగాని పాప ప్రాయశ్చిత్తం కొరకు కాదు. దానిని క్రీస్తు సంపూర్ణంగా నెరవేర్చాడు.

8. **ఆలయంలో నుండి ప్రవహించే నది (47:1) :** దీని నీళ్ళు బలిపీఠమునకు దక్షిణముగా మందిరపు కుడిప్రక్క నుండి, ప్రారంభమై తూర్పువైపు, తిరిగి దక్షిణమునకు మళ్ళి ఎడారి గుండా, మరియు యొర్దాను నది నుండి మృత సముద్రంలో పడుతుంది (47:2,6,12). అప్పుడు ఆ సముద్రపు నీళ్ళు మంచినీళ్ళు అవుతాయి (47:8).

9. **ఆలయంలో దేవుని మహిమనింపబడుట (43:1–5).**

10. **దాని పట్టణం (48:35) :** వెయ్యేండ్ల పాలన నుండి (ఈ శతాబ్ధి నుండి) యెరూషలేము **"యెహోవా ఉండు స్థలము"** (హెబ్రీ భాషలో యెహోవాషమ్మా) అని పిలువబడుతుంది.

తిరిగి వచ్చిన దేవుని మహిమను గూర్చిన ఈ దర్శనం భవిష్యత్కాలానికి సంబంధించినది, అయితే చెరలో నున్న ఇశ్రాయేలీయులను దేవుడు అంతటితో విడిచిపెట్టలేదుగాని, యిర్మీయా ప్రవక్త ద్వారా సెలవిచ్చిన ప్రకారం 70 సంవత్సరాల అనంతరం తిరిగి వారి దేశానికి తీసుకొని వచ్చాడు.

## II. ఇశ్రాయేలు జాతి సమకూర్పు (36, 37 అధ్యాయాలు)

ఎ) **సమకూర్పు యొక్క అవశ్యకత (36:17–19) :** యూదులు వారి పాపమును బట్టి

చెరకు పంపించబడ్డారు గనుక వారు అలాగే ఉండక తిరిగి దేవునివైపు తిరగాల్సిన అవశ్యకత ఉంది. అంత మాత్రమే కాక, అన్యదేశాలు సిగ్గుపర్చబడడానికి (36:1-7) మరియు దేవుని నామం ఘనపర్చబడడానికి (36:20-23,32) దేవుడు వారిని తిరిగి రప్పించాడు.

బి) **సమకూర్పును గూర్చిన దర్శనం (37:1-14) :** ఎండిన ఎముకలున్న లోయను గూర్చిన ఈ దర్శనం ఇశ్రాయేలు జాతినే సూచిస్తున్నది. ఎండిన ఎముకల్లా ఉన్న వారిని ఆయన తిరిగి జీవింపజేస్తాడు. దేవుని ఈ కార్యంలో యెహెజ్కేలు సాధనంగా ఉన్నాడు. దేవుడు అతన్ని ప్రవచించమని చెప్పాడు. యెహెజ్కేలు దేవుడు చెప్పిన మాటల్నే ప్రవచించాడు. ఎముకలన్ని సమకూర్చబడి, ఒకదానితో ఒకటి కలిసాయి. వాటిపై నరాలు, మాంసం పొదగబడ్డాయి. మరలా, నలుదిక్కుల నుండి జీవాత్మ వారిలో ప్రవేశించాలని ప్రవచించగానే, వారు సజీవులై లెక్కింప శక్యముగాని మహాసైన్యమై నిలిచారు. ఈనాడు కూడా దేవుడు తన కార్యాలను చేయడానికి మానవుల్ని సాధనాలుగా వాడుకొంటున్నాడు. మనచుట్టు ఆత్మీయంగా చచ్చిన స్థితిలో ఉన్నవారు అసంఖ్యాకులున్నారు. వారికి దేవుని మాటల్ని చెప్పడం మన వంతు (రోమా 10:17), వారిని పాపాలను గూర్చి ఒప్పింపజేసి నూతన జీవాన్ని ప్రసాదించడం పరిశుద్ధాత్మ వంతు (యోహాను 16:8), దేవుడు సెలవిచ్చిన మాటలు నీవు పలుకుతున్నావా?

సి) **సమకూర్పు ఫలితం (36:28-37:27) :** ఇశ్రాయేలీయులు తిరిగి దేవుని ప్రజలౌతారు (36:28; 37:27). దేవుడు వారిని శుద్ధీకరించి (36:25; 37:23) వారిలో ఆయన ఆత్మను నివసింపజేస్తాడు (36:27). నూతన హృదయాలనిస్తాడు (36:26). వారికి ఒక్కడే కాపరి ఉంటాడు (37:24) ఆయన ఇచ్చిన దేశంలో నిత్యం నివసిస్తారు (37:25). సర్వసమృద్ధినిచ్చి (36:29, 30) జనాంగాన్ని అభివృద్ధి చేస్తాడు (36:38).

## III. దేవుని ఉగ్రత బయలుపర్చబడుట (38, 39 అధ్యాయాలు)

యెహెజ్కేలు 25-29 అధ్యాయాలలో దేవుని శత్రువులైన అమ్మోనీయులు, ఏదోమీయులు, మోయాబీయులు, ఫిలిష్తీయులు, తూరు, సీదోను దేశస్తులు మరియు ఐగుప్తీయులు శిక్షించబడడం గమనార్హం. వీరు ఇశ్రాయేలీయులను బాధించినందువలన దేవుని శిక్షావిధికి లోనయ్యాడు. అయితే భవిష్యత్తులో ఇశ్రాయేలుపై దాడి చేయనైయున్న వారిని గూర్చి మరియు వారిపైకి రాబోతున్న దేవుని ఉగ్రతను గూర్చి కూడా యెహెజ్కేలు గ్రంథంలో వ్రాయబడింది (యెహెజ్కేలు 38, 39 అధ్యా). ఇశ్రాయేలుకు ఉత్తర భాగానగల రష్యా దేశాన్ని గూర్చి ఈ విషయాలు వివరించబడ్డాయి. యెహెజ్కేలు 38వ అధ్యాయం మరియు దానియేలు 11:40-44 ఆధారంగా ఆ దాడులు ఈ క్రమంలో జరుగుతాయని చెప్పుకోవచ్చును. పాలస్తీనకు దక్షిణంలోనున్న ఐగుప్తు ఒక ప్రణాళిక ప్రకారం దానిపై దాడిచేస్తుంది (దానియేలు 11:40ఎ). ఉత్తరము నుండి రష్యా, నౌకాదళంతోను, కాల్బలంతో యుద్ధానికి వస్తుంది (దాని 11:40బి). అంతటితో ఆగక రష్యా దక్షిణంగా సాగిపోయి ఐగుప్తును కూడా స్వాధీనం చేసుకొంటుంది (దాని. 11:42,43). అంతట తూర్పు నుండి మరియు ఉత్తరం నుండి వచ్చిన వర్తమానాలను బట్టి రష్యా తిరిగి పాలస్తీనకు వచ్చి స్థావరం ఏర్పరచుకొంటుంది. ఈ సందర్భంగా దేవుడు, భూకంపం,

(యెహె. 38:19,20), సైనికులు ఒకరినొకరు చంపుకోవడం (38:21), తెగులు (38:22), ప్రళయమైన వాన, వడగండ్లు, అగ్నిగంధకాల (38:22, 39:6) ద్వారా ఇశ్రాయేలు పర్వతాలపై రష్యాకు ఓటమిని కలుగజేస్తాడు. సుమారు 83% సైనికులు నాశనం చేయబడతారు (39:2). వారి కళేబరాలతో ఆకాశపక్షులకు విందు చేస్తాడు (39:4, 17-20). ఈలాంటి విందే హార్‌మెగిద్దోను యుద్ధసమయంలో కూడా జరుగబోతుంది (మత్త 14:28, ప్రక. 19:17). మృతుల కళేబరాలను పాతిపెట్టడానికి 7 సంవత్సరాలు పడుతుంది (39:9,10).

ఇవన్నీ తూ.చ. తప్పకుండ జరుగుతాయన్నది వాస్తవం. యెహెజ్కేలు చెరలోని ప్రజలను గూర్చి చెప్పినవన్నీ నెవవేరినేట్లే ఇవన్నీ భవిష్యత్తులో నెరవేర్చబడతాయి. చరిత్రలో దేవుని సార్వభౌమత్వాన్ని, ఆయన జోక్యాన్ని ప్రతి విశ్వాసి జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఆయన రాకడకై సిద్ధపడాలి. మారనాథ అని చెప్పగలగాలి.

## IV. యెహెజ్కేలు నాటకీయంగా ప్రదర్శించిన సాదృశ్యాలు :

1. **యెరూషలేము పట్టణపు రూపాన్ని చిత్రించుట (4:1-3) :** పట్టణం ముట్టడి వేయబడినట్లు, దాని యెదుట బురుజులను కట్టినట్లు, దిబ్బ వేసినట్లు, దాని చుట్టు ఉన్న ప్రాకారాలను కూలగొట్టు యంత్రాలున్నట్లు చిత్రించాలి. అతనికి మరియు పట్టణానికి మధ్య ఇనుపరేకును గోడగా నిలువబెట్టాలి. ఈ గోడ భేదింప శక్యముగాని బబులోను సైన్యాన్ని సూచిస్తున్నది. దానిని తప్పించుకోవడం అసాధ్యమని ఈ సాదృశ్యం ద్వారా తెలియజేయబడింది.

2. **ఒకే ప్రక్కన పండుకొనుట (4:4-6) :** 390 రోజులు ఇశ్రాయేలు వారి దోషాన్ని భరిస్తూ ఎడమ ప్రక్కన, 40 రోజులు యూదావారి దోషాన్ని భరిస్తూ కుడి ప్రక్కన పండుకోవాలి. సంవత్సరమునకు ఒక దినము చొప్పున మొత్తం 430 రోజులు అలా పండుకోవాలి. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దాసత్వంలో ఉన్నకాలం కూడా 430 సంవత్సరాలు (నిర్గ. 12:40,41). బహుశా దాదాపుగా అలాంటి అనుభవమే ఈ చెరకాలంలోను ఉండవచ్చును. అయితే ఉత్తర రాజ్యము అధికంగా దాసత్వాన్ని అనుభవిస్తుందని ఈ సాదృశ్యాన్ని బట్టి తెలుస్తుంది.

   యెహెజ్కేలు అలా పండుకొన్న దినాలన్ని తూనిక చొప్పున భోజనం చేయాలి. కొలత ప్రకారం నీళ్ళు త్రాగాలి. గోదుమలు, యవలు, కాయధాన్యములు, చోళ్ళు, సజ్జలు, తెల్ల జిలకర్రతో రొట్టెలు చేసి గోమలముతో కాల్చుకొని తినాలి. ఈ సాదృశ్యం యెరూషలేములో రాబోతున్న ఆహార కొరతను సూచిస్తున్నది (4:9-17).

3. **తలవెండ్రుకలను, గడ్డమును క్షౌరము చేసికొనుట (5:1-4) :** యెహెజ్కేలు తన తలను, గడ్డమును క్షౌరము చేసికొని, ఆ వెండ్రుకలను తూచి మూడు భాగములుగా చెయ్యాలని ఆదేశించబడ్డాడు. పట్టణము ముట్టడి చేసిన దినాలు సంపూర్ణమైనప్పుడు, ఆ వెండ్రుకలలో ఒక భాగాన్ని (1/3 వంతు) పట్టణంలో కాల్చి, రెండవ భాగాన్ని తీసి ఖడ్గము చేత హతము చేయురీతిగా చుట్టు విసిరికొట్టి మిగిలిన భాగాన్ని గాలికి ఎగిరిపోనివ్వాలి. అయితే వాటిలో కొన్నిటిని తీసికొని చెంగున కట్టుకోవాలి. అందులో కొన్ని తీసి అగ్నిలో వేసి కాల్చాలి. ఇది వారికి కరవు ద్వారా, ఖడ్గము ద్వారా మరియు

చెదరగొట్టబడుట ద్వారా కలిగే శిక్షకు సాదృశ్యంగా ఉంది (5:12).

4. **దేశాంతరము పోవువానివలె సామాగ్రిని మూట కట్టుకొని వెళ్ళుట (12:1) :** ఇశ్రాయేలీయులు ద్రోహులై కన్నులుండి చూడనివారు, చెవులుండి వినని వారు గనుక వారు చూస్తు ఉండగా యెహెజ్కేలు తన సామాగ్రిని మూటకట్టుకొని గోడకు కన్నమువేసి దాని గుండా బయలుదేరాలి. మూటను భుజము మీదపెట్టుకొని నేల కనబడకుండ ముఖాన్ని కప్పుకోవాలి. నీవు ఏమి చేస్తున్నావని ఇశ్రాయేలీయులు అడిగితే, నేను మీకు సూచనగా ఉన్నాను, నేను సూచించినట్లే మీకు జరుగుతుంది, మీరు చెరలోనికిపోయి దేశాంతర నివాసులౌతారని చెప్పాలి. వారిలో ప్రధానుడైన వాడు అనగా రాజైన సిద్కియా ఎలా పట్టబడి, బబులోనులో చనిపోతాడో చెప్పబడింది (12:12-14 మరియు 2 రాజులు 25:1-7 వరకు కూడా చదవండి). యెరూషలేము నివాసులు ఆ సమయంలో చింతతో భోజనం చేస్తారని, యెహెజ్కేలు సాదృశ్యంగా చేసి చేపించాడు (12:17-20).

5. **ఒకే దేశము నుండి రెండు మార్గాలు వచ్చునట్లు చిత్రించుట (21:18-23) :** బబులోను రాజు ఖడ్గము ఈ రెండు మార్గాల నుండి వస్తుందని చూచించడానికి ఖడ్గము చేతనున్న హస్తరూపాన్ని, పట్టణపు వీధికొనను గీయాలి. ఖడ్గము నుండి అమ్మోనీయుల పట్టణమైన రబ్బాకు ఒక మార్గాన్ని, యూదా దేశంలోని యెరూషలేమునకు ఒక మార్గాన్ని గీయాలి. ఈ రెండు పట్టణాలు క్రీ.పూ. 593లో నెబుకద్నెజరుపై తిరగుబాటు చేసాయి. అతడు రెండు మార్గాల మధ్య నిలుచుండి శకునం చూసినప్పుడు, యెరూషలేమును మొదట ముట్టడి వేయాలని వచ్చింది.

6. **కుండను గూర్చిన సాదృశ్యం (24:1-14) :** కుండలో నీళ్ళుపోసి పొయ్యిమీద పెట్టాలి. మందలో శ్రేష్ఠమైన గొఱ్ఱెలను వధించి వాటి మాంసంలో మంచి ముక్కలనన్నిటిని ఎముకలతో సహా అందులో వేయాలి, మాంసమంతా ఉడిపోయేంతగా బాగా ఉడికించి, చారు చిక్కగా దింపాలి. ఆ కుండకు అంటిన మష్టు అంతాపోయి వేడియై మెరుగు పట్టువరకు పొయ్యిమీదనే ఉంచాలి. దేవుని తీర్పు అనే అగ్ని యెరూషలేమును అందులోని గొప్పవారిని సయితం పూర్తిగా నాశనం చేస్తుందని ఈ సాదృశ్యం తెలుపుతున్నది. అందుకు కారణం వారి అపవిత్ర ప్రవర్తనే. దేవుడు పరిశుద్ధుడు. దహించు అగ్ని. గనుక తన నామమును ధరించి అపవిత్రతకు అప్పగించుకొన్న వారి విషయం తప్పక కఠిన చర్య తీసుకొంటాడు.

7. **కన్నులకు ఇంపైనది తీసివేయబడుట (24:15-27) :** ఈ సాదృశ్యాన్ని ఇశ్రాయేలుకు చూపించడానికి యెహెజ్కేలు తన భార్యను కోల్పోవలసివచ్చింది. తన భార్య హఠాత్తు మరణాన్ని గూర్చి అతడు ఏడ్వవద్దని, శిరోభూషణాలు తలమీద నుండి తీయవద్దని (2 సమూ. 15:30), పాదరక్షలు విడువవద్దని (యెషయా 20:2) ఆజ్ఞాపించబడ్డాడు. ఇదంతా ఇశ్రాయేలీయుల కుమారులకు, కుమార్తెలకు జరుగబోయే దానిని గూర్చి సూచించబడింది (24:21-25). యాజకుడు తన సమీప బంధువుల నిమిత్తం అంగలార్చవచ్చును (లేవీ 21:1-3) అయితే యెహెజ్కేలు అందుకు అనుమతించబడలేదు. ఎవరైన చనిపోయినప్పుడు వారి స్నేహితులు ఆ కుటుంబస్తులకు

భోజనం వండి పంపించేవారు (ద్వితీ. 26:14; యిర్మీ. 16:7; హోషే. 9:4). ఆ భోజనాన్ని కూడా అతడు తినవద్దని దేవుడు చెప్పాడు. తన భార్య కొన్ని గంటలలో చనిపోబోతున్నదని తెలిసి కూడా యెహెజ్కేలు దేవుని మాటకు లోబడి తన పరిచర్యను కొనసాగించాడు. ఉదయం ప్రజలకు ప్రకటించాడు. సాయంత్రం అతని భార్య చనిపోయింది. మరునాడు ఉదయం దేవుడు చెప్పినట్లు చేసాడు (24:18). యెహెజ్కేలుకు విధించబడిన కఠిన నియమాలు ఏ ప్రవక్తకు లేక యాజకునికి విధించబడలేదు. అయినా యెహెజ్కేలు దేవుని కొరకు అన్ని భరించాడు. దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చుటకు తన జీవితాన్నే ఫణంగా పెట్టాడు.

## V. ముగింపులో ఓ హెచ్చరిక !

ప్రియ పాఠకులారా! దేవుని మహిమ కొరకు సృజించబడిన మీరు, మీ వ్యక్తిగత, కుటుంబ, సంఘ జీవితాల ద్వారా దేవుణ్ణి మహిమ పరుస్తున్నారా? లేక అన్యజనుల మధ్య దేవుని నామం అవమానపర్చబడేలా జీవిస్తున్నారా? (రోమా 2:24). విశ్వాసి ఎక్కడ ఉంటే అక్కడ దేవుని మహిమ ఉంటుంది. అయితే నీ అపవిత్ర జీవితం ద్వారా దేవుని మహిమ తొలగించబడే ప్రమాదం కూడా వుంది. దాని ద్వారా నీకు మాత్రమే కాదు, నీ ద్వారా దేవుని సంఘానికి కూడా నష్టం కలుగుతుంది. హొఫ్నీ, ఫీనెహాసులు ఇశ్రాయేలీయులలో నుండి దేవుని మహిమ, ఆయన ప్రభావము తొలగించబడడానికి కారకులయ్యారు (1 సమూ. 2:12-17; 4:21,22). దావీదు దేవుని మహిమ తిరిగి నింపబడడానికి కారకుడయ్యాడు. నీవు ఎలా ఉన్నావు? దేవుని మహిమకు దూషణ కలిగించేవారికి, ఆయన మహిమను దొంగిలించే వారికి (యెషయా 42:8). తప్పనిసరిగా శిక్ష విధించబడుతుంది. పరిశుద్ధ జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేవారిని అంతకంతకు దీవిస్తాడు. వారి పరిచర్య అనేకులకు దీవెనకరంగా ఉంటుంది. "మీరు చీకటిలో నుండి ఆశ్చర్యమైన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయునిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (1 పేతురు 2:9). నశిస్తున్న ప్రజల పట్ల యెహెజ్కేలుకున్న భారం ప్రతి విశ్వాసిక ఉండాలి. యెహెజ్కేలు వలె, దేవుడు సెలవిచ్చిన దానిని చేయడానికి ఎంత కఠిన శ్రమలనైనా సహించగలగాలి. అప్పుడే ఆయన శ్రమలతోపాటు ఆయన మహిమలోను పాలిభాగస్తులం కాగలము (1 పేతురు 1:7; 3:13). ప్రభువు మిమ్మును దీవించును గాక!

# గొప్ప దేవుడు

## దానియేలు గ్రంథం - సంగ్రహ సమీక్ష

### I. ఉపోద్ఘాతం :

బైబిలులో నాలుగో వంతు గ్రంథాలు ప్రవచనాత్మకమైనవి. వాటిలో భవిష్యత్తులో జరుగబోయే విషయాలను గూర్చి వ్రాయబడ్డాయి. ఈ ప్రవచనాలు ఆ కాలంలో జరిగే వాటినే గాక, 1/5వ భాగం, జరగబోయే వాటిని గూర్చి చెప్పబడ్డాయి. అందులో ఎక్కువ భాగం ఆ గ్రంథాలు వ్రాయబడిన తదుపరి కాలంలో నెరవేర్చబడ్డాయి. ఇంకా నెరవేర్చబడాల్సినవి కూడ ఉన్నాయి. అలాంటి గ్రంథాలలో దానియేలు గ్రంథం ఒకటి.

### 1. గ్రంథకర్త మరియు వ్రాయబడిన కాలం :

ఈ గ్రంథాన్ని ప్రవక్తయైన దానియేలు వ్రాసాడని యేసు స్వయంగా చెప్పాడు (మత్త 24:15). అనగా ఇది క్రీ.పూ. 6వ శతాబ్ధపు చరిత్ర అని తెలుస్తుంది. అయితే అది వ్రాయబడిన కాలమును గూర్చి అనేక సంవత్సరాలుగా విభేదాలున్నాయి. ఆధునిక పండితులు ఇది క్రీ.పూ. 165 సం॥ నాటి (మక్కబీయులు, అంతియొకస్ ఎపిఫనస్ కాలంనాటి) సంఘటనలు ఈ గ్రంథలో ఉన్నాయి గనుక ఆ కాలంలోనే, అనగా దానియేలు తదనంతరం 400 సంవత్సరాలకు వ్రాయబడిందని చెప్తున్నారు. అయితే క్రీ.పూ. 152-37 నాటికే ఈ గ్రంథం యూదులచే ప్రామాణిక గ్రంథంగా అంగీకరించబడింది; మరియు పాత నిబంధన హెబ్రీ భాషనుండి గ్రీకు భాషలోనికి అనువదించబడినప్పుడు, సెప్టువజింట్ అనే ఆ గ్రంథంలో దానియేలు గ్రంథం కూడ ఉన్నది గనుక ముందుగానే వ్రాయబడిందని చెప్పవచ్చును. అలెగ్జాండర్ చక్రవర్తి యెరూషలేముపై దండెత్తి వచ్చినప్పుడు, అక్కడ ఉన్న ప్రధాన యాజకుడు, దానియేలు గ్రంథంలో, అలెగ్జాండర్ చక్రవర్తిని గూర్చి వ్రాయబడిన ప్రవచనాలను అతనికి చూపించాడని, అతడు యెరూషలేమును నాశనం చేయకుండ తిరిగి వెళ్ళిపోయాడని జోసీఫస్ అనే యూదా చరిత్రకారుడు వ్రాసాడు. దీన్నిబట్టి, దానియేలు గ్రంథం క్రీ.పూ. 303వ సంవత్సరానికి ముందే అనగా అలెగ్జాండర్ జీవించిన కాలానికి ముందే, దానియేలు జీవించిన కాలంలోనే వ్రాయబడిందని చెప్పవచ్చును.

### 2. దానియేలు జీవిత వివరాలు :

ఇతర ప్రవక్తలందరి కంటె, దానియేలు జీవిత వివరాలు ఎక్కువగా బైబిలులో వ్రాయబడ్డాయి. అతడు క్రీ.పూ. 605 సం॥లో బబులోను చెరకు తీసికొనిపోబడినప్పటి నుండి క్రీ.పూ. 536 సం॥ వరకు, అనగా కోరేషు పరిపాలనలో మొదటి సంవత్సరం వరకు అతని జీవితాన్ని గూర్చి దానియేలు గ్రంథంలో ఉంది. అతడు రాజవంశానికి చెందినవాడు. దానియేలు, షద్రకు, మేషాకు, అబెద్నెగో అనే యౌవనస్తులు బబులోను

రాజు ద్వారా నపుంసకులుగా చేయబడ్డారని II రాజులు 20:18ని బట్టి కొంత మంది బైబిలు పండితులు చెప్తారు. దానియేలు నెబుకద్నెజరు, బెల్షస్సరు మరియు దర్యావేషు అనే ముగ్గురు రాజుల పాలనలో, ఏ మాత్రం రాజీతత్వం లేకుండ, నమ్మకంగా పని చేసాడు. దానియేలు దేవునికి బహుప్రియుడు (దాని 10:11). ఇతడు గబ్రియేలు, మిఖాయేలు అనే ప్రధాన దూతల ద్వారా సేవలందుకొన్నవాడు (దాని 9:21; 10:13). అతని సమకాలికుడైన యెహెజ్కేలు, దానియేలు నీతిని, నోవహు మరియు యోబు యొక్క నీతితో పోల్చాడు (యెహె 14:14).

**దానియేలు జీవితంలో మూడు ప్రాముఖ్యతలను గమనించవచ్చును.**

1. దానియేలు ఒక ఉద్దేశముగల వ్యక్తి (A man of purpose). దేవుని వాక్యానికి విధేయత చూపాలన్నదే అతని ప్రధానోద్దేశం (దాని 1:8; 6:10; 1 యోహా 3:3).
2. దానియేలు ప్రార్థనాపరుడు (A man of prayer) (దాని 2:17-23; 6:10; 9:3-19).
3. దానియేలు ప్రవచించే వ్యక్తి (A man of prophecy).

దానియేలు ప్రవచనాలన్నిటిని ఒక మనిషి అస్తిపంజరానికి పోలిస్తే, 2వ అధ్యాయంలోని ప్రతిమ మరియు 7వ అధ్యాయంలోని జంతువులను గూర్చిన ప్రవచనాలు వెన్నెముకలాంటివి. 9వ అధ్యాయంలోని 70 వారాలను గూర్చిన ప్రవచనం వెన్నెముకలో చక్కగా అమర్చబడిన ప్రక్కటెముకల్లాంటివి.

దానియేలు, యోసేపు మరియు ఎస్తేరులాగ ఒక పథకం ప్రకారం, దేవుని మహిమార్థం బబులోను చెరకు ముందుగా పంపించబడ్డాడు. ఇశ్రాయేలీయులందరూ చెరకు వచ్చేంతవరకు బబులోను రాజ్యంలో అతనికి ఉన్నత స్థానం ఇవ్వబడింది, దానియేలుకున్న ఆ పలుకుబడిని దేవుడు బబులోనులోనున్న తన ప్రజల సహాయార్థం వినియోగించాడు. దానియేలుకు, యోసేపుకు కలల భావాన్ని చెప్పేవరం ఉంది గనుక ఒకరితో మరొకరిని పోలుస్తారు (ఆది 37:59; 40:8; 41:25 మరియు దాని 2:24; 4:19 చదవండి).

**3. దానియేలు గ్రంథ విశిష్ఠత :**

మానవ చరిత్ర అంతటిలో దేవుడు చేసిన అద్భుతాలను బైబిలులో 5 కాలాలుగా విభజించి చెప్పబడింది. అందులో దానియేలు గ్రంథం 3వ స్థానాన్ని వహించింది.

అ. మోషే మరియు యెహోషువ కాలం; ఆ. ఏలియా మరియు ఎలీషా కాలం

ఇ. దానియేలు కాలం

ఈ. క్రీస్తు మరియు ఆయన శిష్యుల కాలం (యేసు భూమ్మీది పరిచర్య కాలం)

ఉ. పేతురు మరియు పౌలు కాలం (ఆదిమ సంఘ కాలం)

దానియేలు గ్రంథం బైబిలులోని ఇతర గ్రంథాలన్నీ అర్థం చేసుకోడానికి

సహాయపడుతుంది. దానియేలు గ్రంథానికి వేరుగా ప్రకటన గ్రంథాన్ని అర్థం చేసుకోవడం కష్టం. దేవుని సార్వత్రిక, సార్వభౌమత్వాన్ని తెలిపే ఈ గ్రంథంలో, ప్రవచనాలు చరిత్రతో పాటు కలిపి అల్లినట్లుంటాయి. అంత మాత్రమే గాక అన్యుల కాలం గూర్చి (దాని 12:4; లూకా 21:24), అంత్యకాలం గూర్చి (దాని 8:17; 1:35, 40) మరియు క్రీస్తు విరోధిని గూర్చి పాత నిబంధనలోని మరే గ్రంథంలోను చెప్పబడనంత వివరంగా ఈ గ్రంథంలో వ్రాయబడింది. దానియేలు గ్రంథం ఆత్మీయ విషయాలనే గాక, నేటి ప్రపంచ రాజకీయ వ్యవస్థను గూర్చి కూడ వివరిస్తుంది. "ప్రపంచాన్ని ఎవరు ఏలుతారు?" అనే ప్రశ్నకు ఈ గ్రంథం జవాబిస్తుంది. డా.జి. కాంప్‌బెల్ అనే బైబిలు పండితుడు ఈ గ్రంథ సారాంశాన్నంతా **"లౌకిక ప్రభుత్వంలో దేవుని స్థిరమైన ప్రభుత్వం"** అని క్రోడీకరించి చెప్పాడు.

ఈ గ్రంథంలోని మరో విశేషమేమంటే, ఇందులోని మధ్యభాగం (2:4 నుండి 7:28 వరకు) అరామిక్ భాషలో వ్రాయబడింది. దానియేలు గ్రంథంలోని అరామిక్ భాషకు ఎజ్రా గ్రంథంలోని భాషకు పోలికలున్నాయి. అలాగే యెహెజ్కేలు, హగ్గయి, ఎజ్రా గ్రంథాలలోని హెబ్రీభాషశైలికి దానియేలు గ్రంథంలోని హెబ్రీ భాషశైలికి పోలికలు ఉన్నాయి.

దేవుని రాజ్యము, వెయ్యేండ్ల పాలన, శాశ్వత భవిష్యత్తును గూర్చి తెలిపే ఈ పుస్తకం ప్రపంచం యొక్క భవిష్యత్ స్థితికి అద్ధంపట్టినట్లు చూపిస్తుంది.

## II. దానియేలు గ్రంథవిభజన :

దానియేలు గ్రంథాన్ని రెండు ప్రధాన విభాగాలు చేయవచ్చును. మొదటి విభాగంలో చారిత్రాత్మక అంశాలు, రెండవ భాగంలో ప్రవచనాత్మక అంశాలు ఉన్నాయి.

### అ. ప్రవచన వెలుగుతో కూడిన చారిత్రాత్మక రాత్రి (The historic night with prophetic light) : 1-6 అధ్యాయాలు

1. యూదా క్షీణత, యెరూషలేము పతనం, దానియేలు బబులోనుకు కొనిపోబడుట – **1 అధ్యా.**
2. బహుళ లోహాల ప్రతిమను గూర్చిన నెబుకద్నెజరుకల; దానియేలు "అన్యుల కాలము"లోని 4 రాజ్యాలను గూర్చి వివరించుట – **2 అధ్యా.**
3. సార్వత్రిక విగ్రహారాధనను గూర్చి ఆజ్ఞ ఇవ్వబడుట, బంగారు ప్రతిమ ఎదుట సాగిలపడనందుకు ముగ్గురు హెబ్రీయులు అగ్నిగుండములో వేయబడుట – **3 అధ్యా.**
4. గొప్ప వృక్షమును గూర్చిన నెబుకద్నెజరు కల, మరియు దాని నెరవేర్పు – **4 అధ్యా.**
5. బెల్షస్సరు చేసిన విందులో, గోడపైన వ్రాత, బబులోను రాజ్య పతనం – **5 అధ్యా.**
6. మాదీయుడైన దర్యావేషును పూజించాలన్న ఆజ్ఞ జారీ చేయబడుట, దానియేలు సింహాల గుహలో వేయబడుట – **6 అధ్యా.**

**ఆ. చారిత్రాత్మక రాత్రిలో ప్రవచనాత్మక వెలుగు (The prophetic light in the historic night) : 7-12 అధ్యాయాలు**

1. "అన్యులకాలము"లోని నాలుగు రాజ్యాలకు సంబంధించిన దానియేలు దర్శనం - **7 అధ్యా.**
2. గొఱ్ఱెపిల్ల, మేకపోతు మరియు మరో చిన్న కొమ్మును గూర్చిన దానియేలు దర్శనం - **8 అధ్యా.**
3. 70 వారములను గూర్చిన దానియేలు దర్శనం - **9 అధ్యా.**
4. చారిత్రాత్మకమైన చిన్న కొమ్ము, మరియు ప్రవచనాత్మకమైన చిన్న కొమ్మును గూర్చి దానియేలు దర్శనం - **10-12 అధ్యా.**
   - అ. దానియేలు దర్శనం నిమిత్తం ప్రార్థన ద్వారా సిద్ధపర్చబడుట, పరలోక దూత ప్రత్యక్షత - **10 అధ్యా.**
   - ఆ. చిన్న కొమ్మును సూచించే పారసీకులు మరియు గ్రీకులను గూర్చిన చారిత్రాత్మక ప్రవచనం, క్రీస్తు విరోధిని సూచించే మరో చిన్న కొమ్ము - **11 అధ్యా.**
   - ఇ. రాబోవు దినాలలో ఇశ్రాయేలును గూర్చిన వివరాలు : మహాశ్రమలు, పునరుత్థానం, బహుమానాలు, అంత్యదినాలను గూర్చిన తుది పలుకులు - **12 అధ్యా.**

## III. బబులోను చరిత్ర :

నోవహుకాలంలో జలప్రళయం తదనంతరం, బాబెలు గోపురం వద్ద నిమ్రోదు మరియు అతని అనుచరుల ద్వారా బబులోను మతాంకురార్పణ జరిగింది (ఆది 11:9). అది క్రీ.పూ. 1830 నాటికి ఒక సామ్రాజ్యంగా ఏర్పడింది. క్రీ.పూ. 900-722 సం. వరకు ఈ సామ్రాజ్యం అష్షూరు ఆధీనంలో ఉంది. క్రీ.పూ. 722 సం॥లో బబులోనీయుడైన మెరోదక్బలదాను అష్షూరీయులపై తిరుగుబాటు చేసాడు (2రాజు 20:12, యెష 59:1). క్రీ.పూ. 626 సం॥లో నెబోపలస్సర్ అనే మరో గొప్ప వ్యక్తి హారాను వద్ద అష్షూరీయులను పూర్తిగా ఓడించి ఈ రాజ్యాన్ని తన స్వంతం చేసుకొన్నాడు. ఇతడు క్రీ.పూ. 605 సం. తన కుమారుడైన నెబుకద్నెజరును కర్కెమిషు వద్ద, ఐగుప్తీయులతో యుద్ధం చేయడానికి పంపించాడు. పారిపోతున్న ఐగుప్తీయులను, నెబుకద్నెజరు, యెరూషలేమునకు దక్షిణ భాగాన పట్టుకొన్నాడు. తిరిగి వెళ్తూ యెరూషలేము పైకి వచ్చాడుగాని అతని తండ్రి మరణవార్త విని వెనక్కి వెళ్ళిపోయాడు. ఇతడు యూదేతర ప్రపంచంలో పేరుగాంచినవాడు. అతని భార్యయైన మాదీయ రాజకుమారి అమిహియా కొరకు బబులోనులో వ్రేలాడే తోటలను (Hanging Gardens) నిర్మించాడు. ఇవి నేటికీ ప్రపంచంలోని 7 వింతల్లో ఒకటిగా పరిగణించబడుతున్నాయి. అతడు యెరూషలేము పైకి మూడు సార్లు దాడి చేసాడు. తుదకు క్రీ.పూ. 605 సం॥ పట్టణాన్ని పట్టుకొని, రాజవంశంలో ముఖ్యమైన వారిని మరియు మందిరంలోని కొంత సామాగ్రిని బబులోనుకు తీసికొనివెళ్ళాడు. అందులో

దానియేలు అతని ముగ్గురు స్నేహితులు కూడ ఉన్నారు. యెరూషలేముపై, యోషీయా కుమారుడైన యెహోయాకీముకు తనపక్షంగా ఆధిపత్యాన్ని అప్పగించి వెళ్ళాడు (2ది.వృ. 36:6,7; దాని 1:1-3).

క్రీ.పూ. 597 సం॥ నెబుకద్నెజరు తిరిగి యెరూషలేము పై దండెత్తి, దేవాలయంలోని వస్తువులన్నిటిని, యెహోయాకీము కుమారుడైన యెహోయాకీనును, రాజ కుమారులను, అధికారులను, నాయకులను మొత్తం 10,000 మందిని మరియు ప్రవక్తయైన యెహెజ్కేలును బబులోనుకు తీసుకొని వెళ్ళాడు (2 రాజు 24:14-16).

క్రీ.పూ. 586 సంవత్సరంలో, యూదా చివరి రాజైన సిద్కియా ద్వారా పురికొల్పబడిన తిరుగుబాటుదారులను అణచడానికి నెబుకద్నెజరు మళ్ళీ యెరూషలేముకు వచ్చాడు. ఆ సమయంలోనే యెరూషలేము ప్రాకారాలు, మందిరం నాశనం చేయబడ్డాయి మరియు పట్టణం కాల్చివేయబడింది. అతడు సిద్కియా కుమారులను చంపి, అతని కళ్ళు ఊడబెరికి తనతోపాటు తీసికొనివెళ్ళాడు.

క్రీ.పూ. 562 సంవత్సరములో నెబుకద్నెజరు మరణాంతరం అతని కుమారుడైన ఎవిల్మెరోదకు కొంతకాలం పరిపాలించాడు (2రాజు 25:27). క్రీ.పూ. 556 సం॥ అష్షూరీయుడైన నబోనిడస్ సింహాసనాన్ని చేజిక్కించుకొన్నా, స్వల్పకాలానికే విరమించుకొని, తన కుమారుడైన బెల్షస్సరుకు తనతో పాటు రాజ్యాధికారం అప్పగించాడు. అతడు మాదీయులు, పారసీకులు, బబులోనును పట్టుకొనేంత వరకు అనగా క్రీ.పూ. 556 సం॥ వరకు పరిపాలించాడు. అతని తరువాత దర్యావేషు పాలన కొనసాగింది. దానియేలు ఈ ముగ్గురి కాలంలోను బబులోనులో ఉన్నాడు.

## IV. దానియేలు గ్రంథం - అంశాల వారిగా సంగ్రహ సమీక్ష

### అ. చారిత్రాత్మక అంశాలు :

నెబుకద్నెజరు, బెల్షస్సరు మరియు దర్యావేషు పరిపాలనలో దేవుని మహాత్కార్యాలు అన్యజనుల మధ్య ప్రత్యక్షపరచబడడానికి, మరియు వారు జీవముగల దేవున్ని ఎరగడానికి దానియేలు దేవునిచే ఒక గొప్ప సాధనంగా వాడుకోబడ్డాడు. అందు నిమిత్తం దేవుడు అతనికి, కలల భావాన్ని తెలిపే వరాన్ని, కల్దీయులందరిని మించిన జ్ఞానాన్ని ఇచ్చాడు (దాని 1:17-20).

### 1. నెబుకద్నెజరు కల - దాని భావం (దాని 2:1-13)

ఈ కలలో నెబుకద్నెజరు ప్రకాశమును, భయంకరమునైన ఒక ప్రతిమను చూసాడు. దాని శిరస్సు మేలిమి బంగారుమయమైనది, దాని రొమ్ము భుజములు వెండివి, దాని ఉదరం తొడలు ఇత్తడివి, దాని మోకాళ్ళు ఇనుపవి, దాని పాదాలలో ఒక భాగం ఇనుపది మరియొక భాగం మట్టిది. చేతి సహాయం లేకుండ తీయబడిన ఒక రాయి, ఇనుము మట్టి కలిసిన ప్రతిమ పాదాల మీదపడి, దాని పాదాలను తుత్తునియలుగా

విరుగగొట్టింది. అంతట ఇనుము, మట్టి, ఇత్తడి, వెండి, బంగారం ఏకంగా దంచబడి గాలికి కొట్టుకొని పోయాయి. ప్రతిమను విరుగగొట్టిన ఆ రాయి సర్వభూతలమంత మహాపర్వతమైంది. ఈ కలలో నెబుకద్నెజరు చూసిన ప్రతిమ ప్రపంచాల్ని ఏలబోతున్న 4 అన్యరాజ్యాలను గూర్చి వివరిస్తున్నది (దాని 2:36-45). పరలోకముందున్న దేవుడు నెబుకద్నెజరుకు అధికారము, బలము, ఘనతను ఇచ్చాడు. అతడే ఆ బంగారపు శిరస్సు. అతని తరువాత, అతని రాజ్యంకంటె తక్కువైన రాజ్యం, అటు పిమ్మట లోకమంత ఏలునట్టి మూడవ రాజ్యం లేస్తుంది. దాని తరువాత నాలుగవ రాజ్యం వస్తుంది. ఇనుము పగులగొట్టినట్లు అది రాజ్యాలన్నిటిని పగులగొడుతుంది. పాదాలు కొంత ఇనుము మరియు మట్టితో కలిసి ఉన్నట్లు, ఆ రాజ్యము ఒక విషయములో బలముగాను, ఒక విషయములో నీరసముగాను ఉంటుంది. ఇనుము, మట్టితో అతుకనట్లు వారు ఒకరితో ఒకరు పొసగక ఉంటారు. ఆ కాలంలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యాన్ని స్థాపిస్తాడు. దానికెన్నటికి నాశనం కలుగదు. అది ముందు చెప్పిన రాజ్యాలన్నిటిని పగులగొట్టి నాశనం చేస్తుంది గాని, అది యుగయుగాల వరకు నిలుస్తుంది.

ఈ కలలో బంగారు శిరస్సు బబులోను సామ్రాజ్యాన్ని, వెండి రొమ్ము, భుజాలు పారసీకుల సామ్రాజ్యాన్ని, ఇత్తడి ఉదరం తొడలు గ్రీకు సామ్రాజ్యాన్ని, ఇనుము మట్టి కలిసిన పాదాలు రోమా సామ్రాజ్యాన్ని సూచిస్తున్నాయి. చేతి సహాయం లేని రాయి యేసుక్రీస్తు. ఆయన నిత్యముండే దేవుని రాజ్యాన్ని స్థాపిస్తాడు.

నెబుకద్నెజరుకు వచ్చిన ఈ కలనే తరువాత దానియేలు తన దర్శనంలో చూచాడు. అతని కల కూడ 4 అన్యరాజ్యాలకు సంబంధించినదే గాని దానియేలు దర్శనంలో అవి 4 జంతువులకు పోల్చబడ్డాయి (దాని 7:1-27). ఇందులో బబులోను సామ్రాజ్యం పక్షిరాజు రెక్కల వంటి రెక్కలుగల సింహముగా, పారసీక సామ్రాజ్యం ఎలుగుబంటిగా, గ్రీకు సామ్రాజ్యం 4 రెక్కలు గల సింహముగా, పారసీక సామ్రాజ్యం ఎలుగుబంటిగా, గ్రీకు సామ్రాజ్యం 4 రెక్కలుగల చిరుతపులిగా, రోమా సామ్రాజ్యం రౌద్రపూరిత క్రూర జంతువుగా సూచించబడ్డాయి.

నెబుకద్నెజరు కల, మరియు దానియేలు దర్శనం, దేవుని సార్వభౌమత్వాన్ని, రారాజుగా ఆయన శాశ్వత పరిపాలనను, మరియు చరిత్రలో ఆయన హస్తాన్ని జ్ఞాపకం చేస్తున్నాయి.

## 2. నెబుకద్నెజరు రెండవ కల - దాని భావం (దాని 4 అధ్యా)

నెబుకద్నెజరు తన ఇంట విశ్రాంతి తీసుకొంటున్న సమయంలో ఈ దర్శనాన్ని చూసాడు (దాని 4:10). అందులో అతడు ఒక బ్రహ్మాండమైన చెట్టును చూసాడు. అది ఆకాశాన్నంటేంత ఎత్తుగా, భూతలమంత విశాలంగా ఉంది. ఈ దర్శనాన్ని చూస్తూ ఉండగా జాగరూకుడగు ఒక పరిశుద్ధుడు "ఈ చెట్టును నరికి, దాని కొమ్మలను కొట్టి

దాని ఆకులను తీసివేసి దాని పండ్లను పారవేయండి; పశువులను దాని నీడనుండి తోలివేయుడి; పక్షులను దాని కొమ్మలనుండి ఎగురగొట్టుడి.” అని ప్రకటించాడు. అయితే దాని మొద్దును ఇనుము, ఇత్తడి కలిసిన కట్టుతో కట్టించి విడచిపెట్టాలని, నిర్ణయకాలంలో ఈ ప్రకటన ప్రకారం జరుగుతుందని చెప్పాడు. ఈ దర్శనం నెబుకద్నెజరు గర్వమును (The Pride of Nebuchadnezzar), అందును బట్టి అతనికి కలిగిన శిక్షను (The Punishment of Nebuchadnezzar) గూర్చి వివరిస్తుంది. నెబుకద్నెజరు తన రాజ్యాన్ని గూర్చి అతిశయించినపుడు, దేవుడు అతని యొద్ద నుండి రాజ్యాన్ని తొలగించాడు. అతడు మనుష్యుల చేత తరుమబడి 7 కాలములు అడవి జంతువుల మధ్య నివాసము చేయాల్సివచ్చింది. ఇదంతా అతడు చూసిన దర్శనం ప్రకారమే సంభవించింది (దాని 4:29-32). ఆ కాలం గడిచాక అతనికి తిరిగి మానవ బుద్ధివచ్చింది. సర్వోన్నతుడగు దేవున్ని స్తుతించాడు.

### 3. బెల్షస్సరు - గోడపై వ్రాత (దాని 5 అధ్యా)

చరిత్రలో దేవుని హస్తం చురుకుగా పని చెయ్యడం ఈ అధ్యాయంలో చూస్తాం. యిర్మీయా గ్రంథం 27:6-7లో ప్రవచించబడిన ప్రకారం నెబుకద్నెజరు అనంతరం అతని కుమారుడైన ఎవిల్మెరోదకు ద్వారా కొంతకాలం (2 రాజు. 25:27) మరియు అతని మనుమని ద్వారా (కుమార్తె కుమారుని ద్వారా) బబులోను పరిపాలించబడింది. తరువాత అతని మరో అల్లుడు నబోనిడస్ దానిని చేజిక్కించుకొని, తన కుమారుడైన బెల్షస్సరుతో కలిసి పరిపాలించాడు. దానియేలు 5వ అధ్యాయంలోని సంఘన జరిగిన సమయంలో నబోనిడస్ యుద్ధరంగంలో ఉన్నాడు. ఓ వైపు శత్రు సైన్యం (మాదీయులు) బబులోనును చుట్టు ముట్టి ఉండగా బెల్షస్సరు విందులో మునిగితేలుతున్నాడు. నెబుకద్నెజరు బబులోను నగరం చుట్టు కట్టించిన ప్రాకారం వారిని రక్షిస్తుందని తలంచాడు, నిర్భయంగా ఉన్నాడు. పైగా దేవుని మందిరపు పరిశుద్ధ స్థలంలోని పరిచర్య కోసం ఉపయోగించే పాత్రలను విందులో ఉపయోగించాడు. అతని తాత నిజమైన దేవున్ని తెలుసుకొని స్తుతించాడని బెల్షస్సరుకు తెలుసు (దాని 5:22), అయినా దేవున్ని అవమానపర్చాడు. వారు బంగారు, వెండి, ఇత్తడి, ఇనుము, కఱ్ఱ, రాళ్ళతో చేయబడిన దేవతలను స్తుతించారు. దేవుడు అతనికి గోడపైని వ్రాత ద్వారా బుద్ధిచెప్పాడు. ఆ రాత్రి కల్దీయుల చరిత్రలో చివరి రాత్రి. బంగారు శిరస్సుకు పోల్చబడిన బబులోను సామ్రాజ్యం ఆ రాత్రితో అంతమైంది. మాదీయుల పరిపాలన ప్రారంభమైంది (దాని 5:30). చరిత్రలోని ఈ రాత్రిని గూర్చి ప్రవచన వెలుగులో ముందుగానే వివరించబడింది. అయినా బెల్షస్సరు అజాగరూకునిగానే ఉన్నాడు.

ప్రియ పాఠకులారా! దేవుడు సెలవిచ్చిన ప్రవచనాలు, సృష్టి ప్రారంభం నుండి నేటి వరకు తప్పకుండ నెరవేర్చబడుతూనే ఉన్నాయి. ప్రభువు రెండవ రాకడను గూర్చిన ప్రవచనం కూడ ఒకానొక దినాన తప్పకుండ నెరవేర్చబడనుంది. **“రాత్రివేళ దొంగ**

**ఏలాగువచ్చునో ఆలాగే ప్రభువు దినము వచ్చునని మీకు బాగుగా తెలియును. లోకులు - నెమ్మదిగా ఉన్నది, భయమేమియు లేదని చెప్పుకొనుచుండగా, గర్భిణీ స్త్రీకి ప్రసవవేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంత మాత్రమును తప్పించుకొనలేరు"** (1 థెస్స 5:2,3). ప్రియ సోదరా! సోదరీ! ఆ దినం మీ జీవితంలో ఘోరమైనదిగా ఉండకూడదు అనుకొంటె ఇతరులవలె నిద్రపోక మెలకువగా ఉండి మత్తులు కాక ఉండాలి (1 థెస్స 5:6-9). ఆయన రాకడకొరకు సిద్ధపడి ఉండాలి.

## ఆ. ప్రవచనాత్మక అంశాలు :

### 1. అన్యుల కాలమును గూర్చి దానియేలు దర్శనం - 7 అధ్యా

దానియేలు గ్రంథం 2వ అధ్యాయంలో అన్యుల కాలమును గూర్చి నెబుకద్నెజరు ఒక ప్రతిమ రూపంలో చూసాడు. ఈ నిర్దేవుల రాజ్యాలను, వారి పరిపాలనా కాలాన్ని దానియేలు తన దర్శనంలో విభిన్న కోణంలో చూసాడు. మనుష్యులు తమ రాజ్యాలను తళతళా మెరిసే లోహాలలాగ చూసుకోవచ్చును గాని, దేవుడు వాటిని ఆకలిగొన్న క్రూర జంతువుల్లాగా చూస్తున్నాడు. మనిషి తన్ను తాను చూసుకొనే విధానంకన్న దేవుడు మానవుల్ని చూసే విధానం వేరని గ్రహించాలి. ఈ దర్శనంలో దానియేలు చూచిన 4 జంతువులు 4 అన్యరాజ్యాలను చూచిస్తున్నవి.

అందులో 4వ జంతువు మిగతా జంతువులకు భిన్నమైనది. దేవుడు దానిని గూర్చే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు గనుక, దానియేలు కూడ దానినే ఎక్కువగా వర్ణించాడు. ఈ జంతువుకున్న 10 కొమ్ములు రోమా సామ్రాజ్యములో పుట్టబోయే 10 మంది రాజులను, చిన్న కొమ్ము వారికి భిన్నంగా ఉన్న రాజును, అనగా పాపపురుషుడు (2 థెస్స 2:3,4) మృగం (ప్రక 13:3-6) అని పిలువబడే క్రీస్తు విరోధిని సూచిస్తున్నాయి. చిన్న కొమ్ముకు ఉన్న కళ్ళు మానవ జ్ఞానాన్ని, మేధస్సును సూచిస్తున్నాయి. క్రీస్తు విరోధి మూడు పనులు చేస్తాడు (దాని 7:25).

1. దేవునికి విరోధంగా మాట్లాడి దేవదూషణ చేస్తాడు (ప్రక 13:5,6).
2. మహోన్నతుని భక్తులను నలుగగొడతాడు (ప్రక 12:13-17).
3. కాలములను, చట్టమును మారుస్తాడు (దాని. 7:25).

**"క్రీస్తు విరోధి"** అంటే దేవునికి, క్రీస్తుకు విరోధి అని ఒక అర్థం. క్రీస్తును అనుకరించేవాడని అర్థం. ప్రకటన 13వ అధ్యాయంలో క్రీస్తు విరోధి ఈ రెండు విధాల పని చెయ్యడం గమనార్హం. చిన్న కొమ్ముకు సూచనగా ఉన్న క్రీస్తు విరోధి స్వల్పకాలం మాత్రమే, అనగా మహా శ్రమల కాలంలో 3 1/2 సం.లు మాత్రమే ఈ భూమి మీద పరిపాలిస్తాడు (ప్రక 11:2-3; 12:6; 13:5).

తరువాత, దానియేలు తన దర్శనంలో దేవుని రాజ్యపాలనను చూసాడు. నెబుకద్నెజరుతో ప్రారంభించబడిన **"అన్యుల కాలం"** క్రీస్తు తిరిగి భూమి మీదికి వచ్చి తన రాజ్యాన్ని స్థాపించేంతవరకు కొనసాగుతుంది. అప్పుడు దైవ రాజ్యపాలన నెలకొల్పబడుతుంది. ఆయన ప్రభుత్వం శాశ్వతమైనది లూకా 1:32). ఆయన రాజ్యం ఎప్పుడు లయంకాదు.

నెబుకద్నెజరు తాను చూచిన ప్రతిమను బట్టి కలవరం చెందినట్లే, దానియేలు తనకు కలిగిన దర్శనాన్ని బట్టి కలవరం చెందాడు (దాని 7:28). ఈ దర్శనంలో **"పరిశుద్ధులు"** అనే మాట దేవుని యందు విశ్వాసముంచిన ఇశ్రాయేలీయుల శేషమును ఉద్దేశించి చెప్పబడింది (దానియేలు 7:18,21,22,25,27).

**2. అన్యజనుల కొమ్ములను గూర్చి దానియేలు చూసిన మరో దర్శనం (8 అధ్యా) :**

ఈ దర్శనంలో దానియేలు రెండు కొమ్ములున్న పొట్టేలును, ఒక కొమ్ముగల మేక పోతును చూసాడు. ఈ దర్శనాన్ని చూసినప్పుడు అతడు షూషను పట్టణంలో ఉన్నాడు. ఈ పట్టణం బబులోనుకు 230 మైళ్ళ దూరంలో మరియు పారసీక (పర్షియా) అగాధానికి 120 మైళ్ళ దూరంలో ఉంది. రెండు కొమ్ములున్న ఈ పొట్టేలు, పారసీక రాజ్య ప్రతినిధియైన 3వ దర్యావేషును సూచిస్తున్నది (దాని 8:1-4). గెలుస్తూ ఉన్న ఈ పొట్టేలు పశ్చిమ దిక్కుకు, ఉత్తర దక్షిణ దిక్కులకు రావడం చూసాడు. ఇవన్నీ పారసీకులు, సిరియా (పశ్చిమ దిక్కు), ఆర్మీనియా (ఉత్తర దిక్కు) ఐగుప్తు (దక్షిణ దిక్కు) దేశాలపై సాధించిన విజయాలను సూచిస్తున్నాయని 4వ శతాబ్దపు చరిత్రకారుడు మార్సెల్లినస్ వివరించాడు.

ఒక కొమ్ముగల మేకపోతు గ్రీసు దేశ ప్రతినిధి అలెగ్జాండర్ మహా చక్రవర్తిని సూచిస్తున్నది (8:5-8). ఈ మేకకొమ్ము అకస్మాత్తుగా విరిగిపోయింది; దానికి బదులుగా 4 ప్రసిద్ధమైన కొమ్ములు పెరిగాయి. అవి అలెగ్జాండర్ మరణానంతరం నాలుగు భాగాలుగా విభజింపబడిన అతని రాజ్యాన్ని సూచిస్తున్నాయి.

ఈ నాలుగు కొమ్ములలో ఒకదాని నుండి ఒక చిన్న కొమ్ము మొలిచింది. 7వ అధ్యాయం 8 వచనంలోని చిన్న కొమ్ము (ప్రవచనాత్మక కొమ్ము), 4వ రాజ్యమైన రోమా ప్రభుత్వం నుండి వచ్చే రాజును అనగా క్రీస్తు విరోధిని సూచిస్తున్నది. 8వ అధ్యాయం, 9వ వచనంలోని, మేకపోతుకున్న ఈ చిన్న కొమ్ము (చారిత్రాత్మక చిన్న కొమ్ము) గ్రీకు సామ్రాజ్యం విభాగించబడిన తదనంతరం రాబోయే సిరియా రాజును, అనగా అంతియొకస్ ఎపిఫనస్‌ను సూచిస్తున్నది.

**వీరిద్దరికి ఉన్న కొన్ని పోలికలను చూద్దాం.**

అ. ఇద్దరూ బహుగా జయిస్తారు (దాని 8:9; ప్రక 13:4).

ఆ. ఇద్దరూ తమ్మును తాము హెచ్చించుకొంటారు (దాని 8:11; ప్రక 13:15).

ఇ. ఇద్దరూ మోసం చేయడంలో ప్రవీణులు (దాని 7:25; 2 థెస్స 2:10).

ఈ. ఇద్దరూ "అంతా నెమ్మదిగా ఉన్నది" అన్నట్లు భ్రమింపజేస్తారు (దాని 8:25; 1 థెస్స 5:2,3).

ఉ. ఇద్దరు దేవుని ప్రజలను ద్వేషించి, హింసిస్తారు (దాని 8:25; ప్రక. 12:13).

ఊ. ఇద్దరూ దేవాలయాన్ని అపవిత్రం చేస్తారు (దాని 8:11; మత్త 24:15).

ఋ. ఇద్దరూ సాతాను వలన శక్తిపొందుతారు (దాని 8:24; ప్రక 13:2).

ౠ. ఇద్దరూ మధ్యప్రాచ్య ప్రాంతంలో 7 సం.లు చురుకుగా పనిచేస్తారు (దాని 8:14; 9:27).

ఎ. ఇద్దరూ ప్రభువైన దేవునికి వ్యతిరేకంగా మాట్లాడతారు (దాని 8:25; ప్రక 13:5,6)

ఏ. ఇద్దరూ ప్రభువైన దేవుని ద్వారా సమూలనాశనం చేయబడతారు (దాని 8:25; ప్రక 19:19,20). అయితే వీరిద్దరూ వేర్వేరు కాలాలలోని, వేర్వేరు వ్యక్తులని జ్ఞాపకముంచుకోవాలి.

### 3. దానియేలు ప్రార్థన - 70 వారములను గూర్చిన రహస్యం (9 అధ్యా)

9:1-9 వరకు దానియేలు చేసిన ప్రార్థనలో ద్వంద్వ అంశాలున్నాయి. ప్రార్థన మరియు ప్రవచనం కూడ ఉంది. యిర్మీయా గ్రంథాన్ని చదివిన దానియేలు యెరూషలేము పాడుగా ఉండవలసిన 70 సం॥లు పూర్తి అయినవని గ్రహించి, ఉపవాసముండి, గోనెపట్టకట్టుకొని, తలపై ధూళి వేసికొని ప్రార్థించాడు. హృదయపూర్వకంగా పశ్చాత్తాపాన్ని వెల్లడించే విధానం అది (ఎజ్రా 8:23; నెహె 9:1; యోనా 3:5,6). దానియేలు ఈ ప్రార్థనలో వ్యక్తిగత మరియు సామూహిక పాపాలు ఒప్పుకొన్నాడు (9:5-13); దేవుని వాగ్ధానాలు జ్ఞాపకం చేసికొన్నాడు (9:4). దేవుని మంచితనానికి, ఇశ్రాయేలు పాపస్థితికి గల వ్యత్యాసాన్ని వివరించాడు (9:5,7,8,9); యూదా రాజుల, అధిపతుల పాపాన్ని ఒప్పుకొన్నాడు (9:8); వారి పాపాన్ని బట్టి ఈ శిక్ష తగినదేనని అంగీకరించాడు (9:12-14). అతన్ని, అతని ప్రజలను పూర్తిగా దేవుని కృపకే అప్పగించాడు (9:18).

దానియేలు ఈ ప్రార్థన చేస్తూ ఉండగా, దేవుడు గబ్రియేలు అనే ప్రధాన దూతను, అతనికి పరిచర్య చేయడానికి, మరియు అతి ప్రాముఖ్యమైన అత్యంత జ్ఞానయుక్తమైన ప్రవచనం యొక్క అర్థాన్ని వివరించడానికి పంపించాడు (9:21-23). బైబిలులో మరెక్కడా ఈ ప్రవచనం వ్రాయబడలేదు (9:24-27). ఈ భాగములో **"70 వారములు"** అనే అంశం ప్రాముఖ్యమైనది. ఈ ప్రవచనం ఇశ్రాయేలును గూర్చి, మెస్సీయాను గూర్చి చెప్పబడింది. అయితే ఈ 70 వారముల కాలం ఎప్పుడు ప్రారంభమౌతుంది? అన్న ప్రశ్న రావచ్చును. యెరూషలేమును మరల కట్టించవచ్చునని ఆజ్ఞ బయలుదేరిన సమయము మొదలుకొని మెస్సీయా వచ్చువరకు ఈ కాలం ఉంటుందని స్పష్టంగా వ్రాయబడింది. ఈ ఆజ్ఞ రాజైన అర్తహషస్త పరిపాలనలో 20వ సంవత్సరమున అనగా క్రీ.పూ. 445వ సంవత్సరములో ఇవ్వబడింది (నెహెమ్యా 2 అధ్యా).

యూదుల లెక్క ప్రకారం, 7 రోజులు ఒక వారంగా సాధారణంగా పరిగణించబడడమే కాకుండ (నిర్గ. 23:12) సందర్భానుసారంగా ఒక సంవత్సరాన్ని ఒక దినంగా, 7 సంవత్సరాలను ఒక వారంగా కూడ లెక్కించేవారు, 7 అనే సంఖ్యకు వాడబడిన **"షబూవ"** అనే హెబ్రీ పదానికి ఒక కొల పరిమాణము అని అర్థం. అది ఏ కొలత అయినా సరే, ఉదాహరణగా మనం ఒక డజను అని చెప్పినట్లుగా 7 అనే సంఖ్య ఉపయోగించబడేది. ఇశ్రాయేలీయులు ప్రతి 7వ సంవత్సరం భూమిని పండించకుండ దానికి విశ్రాంతి నివ్వాలి (లేవీ 25:5). ఇశ్రాయేలీయులు కనానులో నివసించిన కాలంలో 70 సార్లు ఈ ఆజ్ఞను మీరారు. అనగా (70×7) 490 సంవత్సరములు అలా జరిగించారు. ప్రతి 7 సంవత్సరములకు ఒక సంవత్సరం చొప్పున 490 సంవత్సరముల అవిధేయతకు 70 సంవత్సరములు చెరలో ఉండాల్సి వచ్చింది (2 ది.వృ. 36:21). అలాగే దానియేలు గ్రంథంలోని 70 వారాలను లెక్కిస్తే (70×7) 490 సంవత్సరములు అవుతుంది.

**అ. ఈ 70 వారాల కాలము తిరిగి 3 కాలాలుగా విభజింపబడింది.**

1. మొదటి కాలం (దాని. 9:25) 7 వారాలు లేక 49 సం॥లు – క్రీ.పూ. 445–396.
2. రెండవ కాలం (దాని. 9:25) 62 వారాలు లేక 434 సం॥లు – క్రీ.పూ. 396 – క్రీ.శ. 32 సం॥లు
3. మూడవ కాలం (దాని. 9:27) ఒకవారం, లేక 7 సంవత్సరాలు – సంఘము ఎత్తబడినది మొదలుకొని క్రీస్తు వెయ్యేండ్ల పాలన వరకు.

మొదటి రెండు కాలాలలోని సంవత్సరాలన్నీ కలిపితే (49+434) 483 సం॥లు. పాత నిబంధన కాలమానం ప్రకారం సంవత్సరానికి 360 దినాల చొప్పున లెక్కిస్తే మొత్తం 1,73,880 దినాలు. అలా యెరూషలేము కట్టబడాలన్న ఆజ్ఞ బయలుదేరిన నాటి నుండి, (క్రీ.పూ. 445, మార్చి 14వ తేది) 1,73,880 దినాలు లెక్కిస్తే సరిగ్గా క్రీస్తు యెరూషలేములో ప్రవేశించిన దినం (క్రీ.శ. 32సం., ఏప్రిల్ 6వ తేది) వస్తుంది. సరిగ్గా ఆ దినమే క్రీస్తును చంపాలన్న ప్రణాళిక వేయబడింది (లూకా 19:47).

ఈ 70 వారాలను గూర్చి పలు అభిప్రాయాలున్నాయి. అయితే ఒకటి మాత్రం వాస్తవం. దానియేలు చెప్పిన వాటిలో కొన్ని నెరవేర్చబడ్డాయి, ఇంకా జరగాల్సినవి తప్పకుండ జరిగితీరుతాయి. గనుక సమయముండగానే వాటిని అర్థం చేసికొని, మెలుకువగా ఉండి సిద్ధపడడం అవసరం.

మొదటికాలం, రెండవకాలం పూర్తి అయ్యాక మూడవకాలం వరకు మధ్యలో వ్యవధికాలం ఉండడం గమనార్హం. అనగా క్రీస్తు మరణ పునరుత్థానాల నుండి సంఘం ఎత్తబడేంత వరకు వ్యవధి ఇవ్వబడింది. ఒకే వచనంలో అలా రెండు కాలాలను గూర్చి ప్రస్తావించబడడం, మధ్యలో వ్యవధి ఉండడం పలు సందర్భాలలో చూడవచ్చును. యెషయా 9:6,7 లో **"ఏలయనగా మనకు శిశువు పుట్టెను"** అన్న వాక్యానికి (క్రీస్తు

జన్మకు) **"ఆయన భుజము మీద రాజ్యభారముండును"** అనే వాక్యానికి (వెయ్యేండ్ల పాలనకు) చాల సంవత్సరాల వ్యవధి ఉన్నది. అలాగే జెకర్యా 9:9 వచనంలో క్రీస్తు యెరూషలేము ప్రవేశమును గూర్చి, 10వ వచనంలో వెయ్యేండ్ల పాలనను గూర్చి, యెషయా 61:2 లో యెహోవా హితవత్సరం (యేసు భూమ్మీద పరిచర్య) ప్రతి దండన దినం (మహాశ్రమల కాలం) గూర్చి వ్రాయబడ్డాయి. కనుక 69 వారాలకు 70వ వారానికి మధ్య వ్యవధి ఉండడం క్రొత్త విషయమేమి కాదని గమనించాలి. ఈ వ్యవధి కాలం గూర్చి పాతనిబంధన ప్రవక్తలకు తెలియపర్చబడలేదు (ఎఫెసీ. 3:4,5; 1 పేతురు 1:10,11). ఈ 70 వారాల కాలంలో జరిగే విషయాలు అత్యంత ప్రాముఖ్యమైనవి.

**ఆ. 70 వారాల కాలంలో జరిగే విషయాలు :**

1. మానవ పాపానికి, (ముఖ్యంగా ఇశ్రాయేలు జాతి పాపానికి) ఒక ముగింపు, లేక నివారణ జరగడం (యెహె 37:23; రోమా 11:26,27).
2. మెస్సీయా చంపబడుట ద్వారా, ప్రజల అపరాధాల విషయం దేవునితో సమాధాన పరచబడే అవకాశం లభిస్తుంది (2 కొరి 5:18–20).
3. ఈ లోకాన్ని నీతిగా పరిపాలించే సామర్థ్యం సాతానుకు లేదని నిరూపించబడుతుంది.
4. ప్రవక్తల, ప్రవచనాలు నెరవేర్చబడుట వలన వారు నిజమైన ప్రవక్తలని నిరూపించబడుతుంది.
5. సాతాను, వాని అనుచరుడైన క్రీస్తు విరోధి నాశనం చేయబడతారు (ప్రక 19:20; 20:10).
6. వెయ్యేండ్ల పాలనలో జరిగించబడే క్రీస్తు పరిచర్య (కీర్త 45:3–7; యెష 11:3–5; యిర్మీ 23:3–8).

**ఇ. 70 వారాల కాలంలోని ప్రాముఖ్యమైన వ్యక్తులు :**

1. అభిషిక్తుడు – ప్రభువైన యేసుక్రీస్తు (దాని 9:25).
2. వచ్చునట్టి రాజు – దుష్టుడైన క్రీస్తు విరోధి (దాని 9:26).

**4. ఇశ్రాయేలు భవిష్యత్తు, మరియు పారసీక, గ్రీకు రాజ్యాల భవిష్యత్తును గూర్చిన దర్శనం (10, 11) అధ్యా.**

ఇది పారసీక రాజగు కోరేషు పరిపాలనలో 3వ సంవత్సరమున జరిగిన విషయం (దాని, 10:1). తనకు దర్శనం ద్వారా తెలియజేయబడిన ప్రకారం గొప్ప యుద్ధం జరుగబోతున్నదని దానియేలు గ్రహించి, మూడు వారాలు అన్నపానాలు మానేసి దుఃఖముఖుడై ఉన్నాడు. ఆ సమయంలో అతడు ఆదియందున్న క్రీస్తు మహిమాన్విత స్వరూపాన్ని చూసాడు (దాని. 10:5–9). ఈ దర్శనాన్ని చూసిన దానియేలు బలహీనుడై, నేలను సాష్టాంగపడి గాఢనిద్రలోనికి వెళ్ళిపోయాడు. అప్పుడు గబ్రియేలు అనే దూత

అతన్ని తట్టి లేపాడు. అతడు జరుగబోయే సంగతులను దానియేలుతో చెప్పడానికి పంపించబడ్డాడు కాని పారసీకుల రాజ్యాధిపతి అతన్ని 21 దినాలు ఎదిరించాడని, మిఖాయేలు అనే దూత అతనికి సహాయం చేసాడని తెలుస్తున్నది (దాని. 10:13). గబ్రియేలు దూత, తాను తిరిగి ఆ రాజుతో యుద్ధం చేయడానికి వెళ్ళాలని, అతడు బయలుదేరుతూ ఉండగానే గ్రీకు రాజు యుద్ధానికి వస్తాడని చెప్పాడు. ఇక్కడ 'పారసీకుల రాజ్యాధిపతి' అని చెప్పబడిన వ్యక్తి బహుశ, సాతాను యొక్క అనుచరులలో ప్రధానుడై యుండవచ్చును. ఎందుచేతనంటే మానవులెవరికీ ప్రధాన దూతయైన గబ్రియేలును అన్ని రోజులు ఎదిరించే శక్తిలేదు (మత్తయి 9:34; 12:24; యోహాను 12:31; 14:30; 16:11; యెషయా 24:21 చదవండి). ఈ దూతకూడ మిఖాయేలుకు సహాయకారిగా ఉన్నాడు. దూతలిద్దరూ ఒకరికొకరు సహాయం చేసుకోవడం గమనార్హం (దాని 11:1). పారసీక రాజ్యాధిపతికి, గబ్రియేలుకు జరిగిన పోరాటం, విశ్వాసులకు, సాతాను శక్తులకు జరిగే పోరాటం లాంటిదే (2కొరింథి 10:3-5); ఎఫెసీ. 6:12; రోమా 8:38; ఎఫెసీ 3:10; కొల 2:15).

ఈ దూత చెప్పిన ప్రకారం భవిష్యత్తులో ఈ క్రింది విషయాలు జరుగుతాయి. 11వ అధ్యాయమంతటిలో చెప్పబడిన ప్రవచనాలలో 38 నెరవేర్చబడ్డాయి. అందులో కొన్ని క్రింద పేర్కొనబడ్డాయి.

**1. అలెగ్జాండర్ చక్రవర్తి తరువాత ఉండబోయే రాజులు**

☛ 4గురు పారసీక రాజుల పరిపాలన - 11:2

☛ అలెగ్జాండర్ రాజ్యస్థాపన మరియు పతనం - 11:3,4

☛ అతని రాజ్యం 4 భాగాలుగా విభాగించబడుట - 11:4

☛ అందులో రెండు రాజ్యాలు సంధికుదుర్చుకొనుట - 11:6

☛ ఐగుప్తు సేనాధిపతి సిరియాను దోచుకొనుట - 11:8

☛ సిరియనులతో సంబంధం విఫలమగుట - 11:9

☛ ఐగుప్తుపైకి అనేకులు యుద్ధానికి వచ్చుట - 11:14

☛ సిరియనులు పాలస్తీనను స్వాధీనం చేసికొనుట - 11:16

☛ సిరియా రాజు వలన దేవాలయం అపవిత్రపరచబడుట - 11:31,32

☛ మక్కబీయుల తిరుగుబాటు - 11:32

☛ మక్కబీయుల క్షీణత - 11:33-35

**2. అంతియొకస్ ఎపిఫనస్ - (11:21-35) చారిత్రాత్మకమైన చిన్న కొమ్ము (దాని 8:9) :** ఇతడు యెరూషలేములో 40,000 మందిని మూడు రోజుల్లో చంపాడు.

అనేక మందిని బానిసలుగా అమ్మివేసాడు. పందిని బలిగా అర్పించి, దాని మాంసాన్ని తినమని యాజకులను బలవంతం చేసాడు. ఆ మాంసాన్ని ఉడికించిన నీళ్ళు దేవాలయంలో చల్లి అపవిత్రం చేసాడు. మందిర సామాగ్రిని తీసికొని వెళ్ళాడు. పరిశుద్ధ గ్రంథాలను నాశనం చేసాడు. బృహస్పతి యొక్క గొప్ప విగ్రహాన్ని అతి పరిశుద్ధ స్థలంలో నిలిపాడు. ఈ సంఘటన గూర్చియే యేసు మత్తయి 24:15లో ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో క్రీస్తు విరోధి వచ్చినప్పుడు ఈ విధంగానే చేస్తాడని చెప్పాడు.

క్రీ.పూ. 171 సం. సెప్టెంబర్ 6వ తేదీన ప్రారంభమైన ఇతని చర్యలు క్రీ.పూ. 165 డిసెంబర్ 25వ తేదీ వరకు కొనసాగాయి. ఈ దినాలన్ని లెక్కిస్తే దాని 8:14లోని, 2300 దినాలకు సరిగ్గా సరిపోతాయి.

యెరూషలేముకు వాయవ్యదిశలో 17 మైళ్ళ దూరానగల మోదిన్ అనే గ్రామంలోని, మత్తతీయ అనే యూదుల యాజకుడు మరియు అతని కుమారులు అంతియోకస్ ఎపిఫనస్‌పై తిరుగుబాటు చేసారు. వీరు హస్మోనీయులు. ఇతని కుమారులలో ఒకడైన యూదా, మక్కబీయుడని పిలువబడ్డాడు. మక్కబీయుడు అంటే సుత్తె అని అర్థం. ఇతని ఆధ్వర్యంలో జరిగిన తిరుగుబాటే మక్కబీయుల తిరుగుబాటు. అంతియొకస్ ఎపిఫనస్ క్రీ.పూ. 164 సం. బబులోనులో యుద్ధం చేస్తుండగా మరణించాడు. క్రీ.పూ. 165 సం॥ డిసెంబర్ 25వ తేదీన యూదులు దేవుని ఆలయాన్ని శుద్ధిచేసి పునః ప్రతిష్ఠించారు. ఈ దినమే తరువాతి కాలంలో ఆలయ ప్రతిష్ఠ పండుగగా ఆచరించబడింది (యోహాను 10:22).

**3. క్రీస్తు విరోధి - అతని లక్షణాలు (11:36-45) - దాని. 7:8లోని ప్రవచనాత్మకమైన చిన్న కొమ్ము.**

- ఉత్తర, దక్షిణ రాజులు అతనితో యుద్ధం చేస్తారు - 11:40
- పరిశుద్ధ స్థలాన్ని ఆక్రమించుకొంటాడు - 11:41
- ఐగుప్తును స్వాధీనం చేసుకొంటాడు - 11:43
- ఐగుప్తులో ఉన్నప్పుడు కలవరపరచే వార్తలు వింటాడు - 11:44
- తిరిగి పరిశుద్ధ స్థలానికి వస్తాడు - 11:45
- సీయోను కొండమీద క్రీస్తు ద్వారా నాశనం చేయబడతాడు - 11:45

## ఇ. అంత్య దినాలలో జరుగబోయే సంగతులు - దాని 12 అధ్యా

### 1. మిఖాయేలు పరిచర్య (దాని 12:1,2) :

అంత్యదినాలలో, సృష్టి ప్రారంభంనుండి ఇది వరకు కనివిని ఎరుగని భయంకరమైన దినాలు రాబోతున్నవి. మత్తయి 24:21,22లో యేసు ప్రభువు చెప్పినదానిని బట్టి ఆ దినాలు మహా శ్రమలకాలంగా గుర్తించబడ్డాయి. ఈ సమయంలో ప్రధాన దూతయైన

మిఖాయేలు, ఇశ్రాయేలీయుల పక్షంగా నిలిచి వారికి సహాయం చేస్తాడు (దాని 12:1). మహా శ్రమల కాలం మధ్యలో మిఖాయేలు, సాతానుతో యుద్ధం చేసి, వాణ్ణి వాని దూతలను పరలోకం నుండి క్రిందికి పడద్రోస్తాడు (ప్రక 12:7). అప్పుడు, తప్పించుకొనిన మూడవ భాగం ఇశ్రాయేలీయులకు, మిఖాయేలు సహాయం చేస్తాడు (జెకర్యా 13:8,9; ప్రక 12:14). వారిలో జీవగ్రంథంలో పేర్లు వ్రాయబడినవారు తప్పించుకొంటారు (నిర్గ. 32:32; కీర్త 69:28; లూకా 10:20; ప్రక. 20:12).

**2. రెండు పునరుత్థానాలు (దాని 12:2) :**

మృతుల పునరుత్థానం రెండు దశలుగా జరుగుతుంది, రెండు విధాలుగా ఉంటుందని ఈ మాటలను బట్టి స్పష్టమౌతుంది. యేసు ప్రభువు కూడ జీవపునరుత్థానం మరియు తీర్పు పునరుత్థానం ఉందని చెప్పాడు (యోహా 5:28, 29). ఈ రెండు వాక్యభాగాలలో రెండు పునరుత్థానాలను గూర్చి కలిపి చెప్పబడినా, ఈ రెండు ఒకేసారి జరుగవని, రెండింటి మధ్య 1000 సంవత్సరముల వ్యవధి ఉంటుందని ప్రకటన 20:4-6 ను బట్టి తెలుస్తుంది. నిత్య జీవము కొరకైన పునరుత్థానంలో పాతనిబంధనలోని పరిశుద్ధులు మరియు మహాశ్రమల కాలంలో హతసాక్షులైన పరిశుద్ధులు ఉంటారు (యోబు 19:25,26; కీర్త 49:15; యెష 25:8; 26:19; హోషే 13:14; ప్రక. 6:4-6; 20:4). నిందపాలగుటకు, తీర్పు కొరకు లేపబడేవారు రక్షణలేని వారు. వీరు ధవళ సింహాసనం వద్ద తీర్పుపొందుతారు (ప్రక 20:11-15).

**3. అంత్య కాలమును గూర్చి 2 ప్రవచనాలు (దాని 12:4) :**

అ. చాలమంది నలుదిశల సంచరిస్తారు; ఆ. తెలివి అధికమౌతుంది; ఈ మాటలు, లౌకిక జ్ఞానం కోసం ప్రజల ప్రయాసాన్ని మరియు ప్రవచనాలను తరచి చూచి తెలుసుకొనే జ్ఞానం నిమిత్తం పడే ప్రయాసను గూర్చి కూడ తెలియజేస్తున్నాయి. అనగా ఇదివరకు ఎన్నడూ లేనంత జ్ఞానం పొందుతారని అర్థం. ఈ ప్రవచనాలను అంత్య కాలము వరకు, అనగా దానియేలు చెప్పిన 70వ వారము వరకు మరుగుచేయమని గబ్రియేలు చెప్పాడు. ఈ దినాలు సమీపిస్తున్న కొలది ప్రతి విశ్వాసి దేవుని మాటల నెరవేర్పు కొరకు ఎదురుచూస్తూ ఈ లోకంలో స్వస్థబుద్ధితో బ్రతకాలి (తీతు 2:13).

**4. మూడు కాలములు (దాని 12:5-13) :**

ఈ దర్శనంలో దానియేలు మరి ఇద్దరు దూతలను చూసాడు. అందులో ఒక దూత, ఈ ఆశ్చర్యము ఎప్పుడు సమాప్తమగునని ప్రశ్నించాడు. రెండవ దూత ఒక కాలము కాలములు అర్థకాలము, పరిశుద్ధ జనము యొక్క బలము కొట్టివేయబడినప్పుడు సకల సంగతులు సమాప్తమౌతాయని చెప్పాడు. అనగా 3 1/2 సంవత్సర కాలం. ఇది మహా శ్రమల కాలంలోని రెండవ భాగం. మొదటి 3 1/2 సంవత్సర కాలములో క్రీస్తు విరోధి అనుదిన బలిని నిలిపి నాశనకరమైన హేయమైనదానిని మందిరంలో

నిలువబెడతాడు. చివరి 3 1/2 సంవత్సర కాలము అంటే 1260 రోజులు, మహాశ్రమల కాలంలో ఘోరమైన శ్రమల కాలం.

ఈ చివరి 3 1/2 సంవత్సరములు గడిచాక (1260 రోజులు) క్రీస్తు విరోధి నాశనం చేయబడినా (ప్రక 19:20) అతడు నిలిపిన మృగము యొక్క ప్రతిమ మరి 30 రోజులు మందిరంలోనే ఉంటుందని కొందరి అభిప్రాయం. కనుక ఈ అదనపు 30 రోజులను చివరి 3 1/2 సంవత్సరాలకు (1260 రోజులకు) కలిపితే 1290 రోజులౌతాయి (దాని. 12:11).

ఈ 1290 రోజులకు మరో 45 రోజులు కలుపబడ్డాయి. ఈ 1335 రోజులు తాళుకొని కనిపెట్టుకొనువాడు ధన్యుడు అని వ్రాయబడివుంది (దాని. 12:12). బహుశ ఈ 45 రోజులు క్రీస్తు తన వెయ్యేండ్ల పాలన కొరకు ప్రభుత్వాన్ని స్థిరపరచే నిమిత్తం అయి ఉండవచ్చును.

దానియేలు కాలాంతము వరకు జీవించకున్నా, అంతము వరకు నిలకడగా ఉంటే పరిశుద్ధులందరితో పాటు ఆ వెయ్యేండ్ల పాలనలో ఉంటాడని చెప్పబడింది.

ప్రియ సోదరా! సోదరీ! దానియేలు ప్రవచించిన రీతిగా ఆ అంత్యదినాలకు మనము అత్యంత సమీపంగా ఉన్నాము. అంతము వరకు సహించినవారే రక్షించబడతారని ప్రభువు చెప్పాడు (మత్త 24:13). అంతము వరకు విశ్వాసాన్ని కాపాడుకోవాలి. దానియేలు వలె పరిశుద్ధతను కాపాడుకోవాలి (దాని 1:8; 1 థెస్స 4:3–5). ప్రభువు కొరకు దానియేలు, షద్రకు, మేషాకు, అబెద్నెగోల వలె శ్రమపడితే, హింసలు సహిస్తే ఆయనతో కూడ ఏలుతాము (దాని 3:12–26; 6:13–28; 2 తిమో 2:11,12). అట్టి కృప ప్రభువు మనకు దయచేయును గాక!

**మీ ప్రతిస్పందన:** ప్రియ శ్రోతలారా! ప్రేమధార కార్యక్రమం పక్షంగా మీరు అందుకున్న **దానియేలు గ్రంథం సంగ్రహ సమీక్ష** ద్వారా అనేక ఆత్మీయ సత్యాలు నేర్చుకొన్నారని విశ్వసిస్తున్నాం. ఈ పుస్తకం ద్వారా మీరు పొందిన ప్రత్యేక ఆశీర్వాదాలను లేక దీనిని బట్టి మీ ఆత్మీయ జీవితంలో కలిగిన మార్పులను మాకు ఉత్తరం ద్వారా గాని, ఫోన్ ద్వారా కాని, ఇ–మెయిల్ ద్వారా గాని తెలుపగలరు.

**TTB - Telugu - Study Outlines - Book of Ezekiel & Daniel**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017.
Ph : 040-27003011

**FREE MP3 DOWN LOAD**
Log on to : **www.radio882.com**